


# విజయభాను





విశాఖపట్నం, మంగళవారం 07-08-2018 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 41 సంచిక : 309 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ

# చత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్





- 15 మంది మావోయిస్టుల మృతి
- 16 ఆయుధాలు స్వాధీనం
- భద్రతా బలగాలు - మావోయిస్టులు పరస్పరం ఎదురు
- కొనసాగుతున్న కాల్పులు
- యాంటీ నక్సల్స్ ఆపరేషన్ ప్రత్యేక డీజీ డీఎం అవస్థీ

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లాలోని కుంట, గొల్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఎదురుకాల్పుల్లో 15 మంది మావోయిస్టులు హతమైనట్లు తెలుస్తోంది. గొల్లపల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రతా బలగాలకు మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో రెండు వర్గాల మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. భద్రతా బలగాల కాల్పుల్లో 15 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు సమాచారం. గొల్లపల్లి ప్రాంతంలో కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయి. ఎన్‌కౌంటర్ జరిగినట్లు జిల్లా ఎస్పీ ధ్రువీకరించారు.

గొల్లపల్లి అటవీ ప్రాంతంలో దాదాపు 200 మంది మావోయిస్టులు సమావేశమైనట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందిందని.. వెంటనే కూంబింగ్ చేపట్టినట్లు యాంటీ నక్సల్స్ ఆపరేషన్ ప్రత్యేక డీజీ డీఎం అవస్థీ తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి 16 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

**పక్కా నిఘా..**

మావోయిస్టుల కార్యకలాపాలపై దృష్టి సారిస్తున్న ఛత్తీస్‌గఢ్ తరువాయి 2లో..

అక్రమ మైనింగ్‌కు

## అడ్డుకట్ట వేయాలి

- క్వారీ బాధితులను పరామర్శించా
- మీ సమస్యలపై త్వరలో స్పందిస్తా
- జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్



కర్నూలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేసినప్పుడే హత్తిబెళగల్ క్వారీ పేలుడు లాంటి సంఘటనలు జరగకుండా ఉంటాయని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అన్నారు. హత్తిబెళగల్ క్వారీలో జరిగిన పేలుడు బాధితులను పవన్ సోమవారం పరామర్శించారు. పవన్ రాక సందర్భంగా కర్నూలు నగరంలోని టోల్‌గేట్‌నుంచి హనుమాన్ సర్కిల్ వరకు అభిమానులు పెద్దయెత్తున ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం హత్తిబెళగల్‌కు వెళ్లిన ఆయన ప్రమాదానికి కారణమైన క్వారీని పరిశీలించారు. అనంతరం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ.. హత్తిబెళగల్ క్వారీ పేలుడు ఘటన దురదృష్టకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో తెదేపా నేతలను సమర్థించి ప్రజా సమస్యలను విస్మరించవద్దని కోరారు. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు అక్రమ మైనింగ్ జరుగుతుంటే గనుల శాఖ మంత్రి, ఆ శాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క తరువాయి 2లో..

మృతుల కుటుంబాలకు

## ఐదు లక్షల పరిహారం



శ్రీకాకుళం : రిమ్స్ ఆసుపత్రిలో ఇంజక్షన్ వికటించి మరణించిన మృతుల కుటుంబాలకు ఐదు లక్షల పరిహారం ఇస్తామని మంత్రి అచ్చన్నాయుడు ప్రకటించారు. శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇంజక్షన్ బాధితులను ఆయన సోమవారం పరామర్శించారు. బాధితులకు అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. విశాఖపట్నంలో చికిత్స పొందుతున్న వారికి కూడా అవసరమైన చికిత్సను అందిస్తామన్నారు. ఘటనపై జ్యుడీషియల్ విచారణ చేపట్టామని, విచారణ పూర్తి అనంతరం తరువాయి 2లో..

## ప్రత్యేక నిధులేవీ!?

- రాష్ట్రంపై కేంద్రం కక్షపూరిత చర్యలు
- తెదేపా ఎంపీల వాకౌట్




దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో వెనకబడిన ఏడు జిల్లాలకు ఇచ్చిన నిధులను కేంద్రం వెనక్కి తీసుకోవడంపై తెలుగుదేశం పార్టీ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం వైఖరికి నిరసనగా లోక్‌సభ నుంచి తెదేపా ఎంపీలు వాకౌట్ చేశారు. బుందేల్‌ఖండ్ తరహాలో వెనకబడిన ప్రాంతాలకు నిధులు ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్రం.. దాన్ని విస్మరించిందని ఎంపీ రామ్మోహన్ నాయుడు మండిపడ్డారు. రాష్ట్రంపై కేంద్రం కక్ష తరువాయి 2లో..

## అవయవదానానికి ముందుకొచ్చిన చంద్రబాబు

- అవయవదానానికి 1.20 లక్షల మంది
- పాశ్చాత్యంశంగా అవయవ దానం

అమరావతి: అసాధ్యాలను సుసాధ్యం చేయడంపై యువత దృష్టి సారించాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సాధ్యంకాదన్న స్థాయి నుంచి చౌక ధరకు కాలుష్యరహిత ఇంధనం ఇచ్చే పరిస్థితులు నెలకొన్నాయని ఆయన గుర్తుచేశారు. కాలుష్యరహిత ఇంధనానికి ఆంధ్రప్రదేశ్ నెలవు కావాలని సీఎం ఆకాంక్షించారు. అమరావతి ప్రజావేదిక హాల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రెండు ముఖ్య కార్యక్రమాలు జరిగాయి. హైఎనర్జీ బెనిఫిటి స్టోరేజీ బ్యాటరీని లాంఛనంగా ఆవిష్కరించిన అనంతరం అవయవదాన కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవయవదానం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకొచ్చారు.



**భారీ బ్యాటరీ ఆవిష్కరణ..**

భారత్ ఎనర్జీ స్టోరేజీ టెక్నాలజీ అందుబాటులోకి తీసుకొచ్చిన విద్యుత్ నిల్వ పరికరాన్ని పారిశ్రామికవేత్తలు, విద్యార్థుల మధ్య సీఎం లాంఛనంగా ఆవిష్కరించారు. తక్కువ ధరకే వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్నది తరువాయి 2లో..






## గెలుపు మనదే

జగన్ సమక్షాన చేరిన సినీనటుడు కృష్ణుడు



తూర్పుగోదావరి: టాలీవుడ్ నటుడు కృష్ణుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైయస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్రకు ఆకర్షితుడునై పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. సోమవారం కత్తిపూడి వైయస్ జగన్ సమక్షంలో కృష్ణుడు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ క్యార్యక్రమంలో పార్టీ నేతలు పెన్మత్స సురేష్ బాబు, సత్రాజు, సూర్యనారాయణ రాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణుడు మాట్లాడుతూ తరువాయి 2లో..




## భూసేకరణ కేటాయింపులపై
# జ్యూడిషియల్ కమిటీ ఏర్పాటు చేయాలని ఆందోళన




**ఆర్డీవో కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న దృశ్యం**

నర్సీపట్నం : రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ కేటాయింపులపై జ్యూడిషియల్ కమిటీ ఏర్పాటు చేసి సూచనలు ద్వారా భూకేటాయింపులు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం(ఏఐకెఎస్) ఆధ్వర్యంలో సోమవారం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం అధ్యక్షులు గోలకొండ నూకినాయుడు, జిల్లా రైతు సంఘం కార్యదర్శి మేకా సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ కేటాయింపు జ్యూడిషియన్ కమిటీ ఏర్పాటు చేసి సూచనలు ద్వారా భూకేటాయింపులు చేయాలని వారు కోరారు. అనంతరం ఆర్డీవో వి.విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి జి.గురుబాబు, సామాజిక హక్కుల పోరాట సమితి నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, గొలుగొండ మండలం రైతు సంఘం నాయకులు జోగా సత్తిబాబు, మాకిరెడ్డి రాజు బాబు, రైతు సంఘం కోశాధికారి కామిరెడ్డి లక్ష్మి, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# మీ సేవా కేంద్రాల ఏర్పాటుకు
## దరఖాస్తుల ఆహ్వానం

రోలుగుంట : మండలంలో మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ పెంటకోట అప్పలనాయుడు తెలిపారు. కుసర్లపూడి, జానకిరాంపురం, కొండపాలెం, నిండుగొండ, ఎన్.కొత్తూరు, వడ్డిప, ఎంకె.పట్నం, కొవ్వూరు, గుండుబాడు, అడ్డసరం, కంచుగుమ్మల పంచాయతీల్లో కేంద్రాలు ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. ఏదైనా డిగ్రీ పాసై, సంబంధిత గ్రామంలో నివాసం ఉండి కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారు అర్హులన్నారు. ఈ మేరకు ఈ నెల 8వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

## ఈనెల 12న
## జలుమూరి ఉచిత మెగా వైద్య శిబిరం

కొయ్యూరు : క్రీ.శే జలుమూరి అప్పారావు 4వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 12న మండలంలోని శింగవరంలో జలుమూరి వారి చేయూతలో భాగంగా ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుల్లో ఒకరైన జలుమూరి వెంకటగిరిబాబు ఒక ప్రకటన తెలిపారు. విశాఖపట్నం, భీమునిపట్నం, అనిల్‌నీరుకొండ, ఆసుపత్రి వారి సౌజన్యంతో నిర్వహించనున్న ఈ శిబిరం పలువురు వైద్య నిపుణులు పాల్గననున్నందున వివిధ రోగాలతో బాధపడుతున్నవారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరెన్ని వివరాలకు 9440727511 సెల్ నెంబరును సంప్రదించాలని కోరారు.

# రూ.5 కోట్లతో అసంపూర్తి పాఠశాల భవనాలు పూర్తికి చర్యలు

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ హరి జవహర్లాల్**



విజయనగరం : జిల్లాలోని ప్రతి మండలంలో గ్రామాల వారీగా పాఠశాలల సమాచారం ఆన్లైన్లో పెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి నాగమణిని జిల్లా కలెక్టర్ డాక్టర్ హరిజవహర్లాల్ ఆదేశించారు.

సోమవారం మండల స్థాయి వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అసంపూర్తి భవనాలు అన్నీ త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. అందుకు ఐదు కోట్ల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదించామని తెలిపారు. అదేవిధంగా అన్ని పాఠశాలలో ప్రస్తుత పరిస్థితులు మౌలిక సదుపాయాల కల్పన ఆన్ లైన్ చేయడం ద్వారా సి.ఎస్.ఆర్, సర్వ శిక్షా అభియాన్, ఇతర నిధుల ద్వారా పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే చర్యలు చేపడతామని తెలిపారు. ఆరోగ్యపరంగా అనేక కేసులు నమోదు అవుతున్నాయని ఆయా కేసులను ఎప్పటికపుడు పరీక్షించి వారం రోజుల్లోగా మెరుగుపరచాలని సూచించారు. ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, శాఖల అధికారులు సహకారంతో జర్నీ మెరుగుపరచాలని, అవసరమైనచోట్ల మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. వ్యవసాయానికి సంబంధించి చేసిన పనులు చెప్పుకోలేక పోతున్నామని చేసిన ప్రతి పని రికార్డు చేసి ఆన్ లైన్ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు నెతీఅంష్ట్రఅ ఝశ్రీఝఅ ఎశీయిఝఱ లో మొదటి ర్యాంకు లో ఉన్నప్పటికీ నివేదికలు అందించ నందున వెనుకబడి ఉన్నామని తెలిపారు. ఐటీడీఏ పరిధిలో ప్రతి 500 హెక్టార్లకు ఒక ఎంపీఈవో ఉండాల్సి ఉన్నందున ఆ దిశలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఆఫీస్ విధానంలో జిల్లాలో 3750 ఫైల్స్ ప్రతిపాదించడం జరిగిందని, అదే కడప జిల్లాతో పోల్చుకుంటే చాలా తక్కువగా ఉందని అభిప్రాయపడ్డ కలెక్టర్ ఈ ఆఫీస్ విధానంలో ఫైల్స్ పంపించడంలో శ్రద్ధ చూపించాలని ఆదేశించారు. తదుపరి వారంలోగా ఈ ఆఫీస్ ఫైల్స్ రాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. విజయనగరం, పార్వతీపురం డివిజన్లలో అత్యంత తక్కువగా ఈ ఆఫీసు ఫైల్స్ ప్రతిపాదించిన వారికి చార్జ్ మెమోలు జారీచేయాలని ఆదేశించారు. ఆధార్ బయోమెట్రిక్ అనుసంధానంలో ఆరో స్థానంలో ఉందని, విద్యాశాఖ, ప్రజారోగ్య శాఖ , ఇంటర్మీడియట్ బోర్డ్ తదితర శాఖలు బయోమెట్రిక్ పాటించకపోవడం వలన వెనుకబడి ఉన్నామని స్పష్టం చేసిన కలెక్టర్ ఆయా శాఖలకు చార్జ్ మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. మీకోసం ద్వారా అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. మీసేవ అమలులో 4వ స్థానంలో ఉన్నామని అందులోకూడా కొన్ని శాఖలు ప్రగతి సాధించ నందున వెనుకబడి ఉన్నామని కలెక్టర్ వివరించారు.

వెనుకబడి ఉన్న శాఖలలో భూగర్భ గనుల శాఖ, ఈపీడీసీఎల్, రెవెన్యూ, మునిసిపల్, పోలీస్ శాఖలు ఉన్నాయన్నారు. మొక్కల పంపిణీలో 96% తో మొదటి స్థానం సాధించామని, అయితే వ్యవసాయ శాఖలో loan eligibility card హోల్డర్లకు కూడా రుణ సదుపాయం కల్పించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సూక్ష్మ పోషకాలు, సాయిల్ టెస్టింగ్, ఎల్ఐసి కార్డుల జారీ తదితర కార్యక్రమాలలో శతశాతం సాధించామన్నారు. పరిష్కార వేదిక ఫిర్యాదులలో నాలుగు జిల్లాలు శతశాతం సాధించాయని అందులో మన జిల్లా కూడా ఉండడం అభినందనీయమని కలెక్టర్ వివరించారు.

పశుసంవర్ధక శాఖలో సైలేజి గడ్డి పంపిణీలో వెనుకబడి ఉన్నామని కలెక్టర్ తెలిపారు. అవసరమైన మరుగుదొడ్లు నిర్మించి బహిరంగ మల విసర్జన రహిత జిల్లాగా తీర్చిదిద్దినప్పటికీ ప్రజలలో మరింత అవగాహన కల్పించి వాటిని వినియోగించే విధంగా ఓ డి ఎఫ్ ప్లస్ లో అభివృద్ధి సాధించాలని కలెక్టర్ కోరారు.

# గ్రీవెన్సీలకు అధిక ప్రాధాన్యత : ఎస్పీ పాలరాజ్



విజయనగరం : జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి. పాలరాజు సోమ వారం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ వ్యథ విభాగానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 30 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వీకరించారు. ఈ ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వయంగా స్వీకరించి, ఫిర్యాదుదారులతో మాట్లాడి, ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటిని పరిష్కరించేందుకు, వాటిపై చర్యలు చేపట్టేందుకు సదరు ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు పంపారు. విజయనగరం పట్టణానికి చెందిన రమణమ్మ ఫిర్యాదు చేస్తూ తన కుమారుడు నవీన్ గత 20 రోజుల నుండి కనిపించడం లేదని, అతని ఆచూకీ కనుగొనాలని కోరారు.ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ ఫిర్యాది డాక్యుమెంట్లును పరిశీలించాలని, కోర్టు ఉత్తర్వులు ఏమైనా ఉన్నాయేమో పరిశీలించాలని, వాస్తవాలు తెలుసుకొని, తనకు నివేదించాలని చీపురుపల్లి సిఐను ఆదేశించారు. కొత్తవలసకు చెందిన సునీత ఫిర్యాదు చేస్తూ తన భర్తపై వరకట్న వేధింపుల కేసును కొత్తవలస పోలీసు స్టేషనులో నమోదైందని, సదరు కేసులో అభియోగ పత్రాన్ని కోర్టులో త్వరితగతిన దాఖలు చేయాలని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ కేసు దర్యాప్తులో ఉందని, కేసులో దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి, కోర్టులో అభియోగ పత్రాన్ని దాఖలు చేయాల్సిందిగా కొత్తవలస సిఐను ఆదేశించారు. గరివిడి మండలానికి చెందిన సన్యాసి నాయుడు ఫిర్యాదు చేస్తూ తన బాగోగులు చూడడం లేదని, తన పేరున ఉన్న భూమిని కూడా తన కుటుంబ సభ్యులు స్వాధీనపర్చుకొనేందుకు ప్రయత్ని స్తున్నారని, న్యాయం చేయాలని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ ఫిర్యాదిదారుడు సీనియర్ సిటిజన్ అయినందున తన ఆస్తులుకు రక్షణగా నిలవాలని, వాస్తవాలని తనకు నివేదించాలని గరివిడి ఎస్ఐను ఆదేశించారు. విజయనగరం పట్టణానికి చెందిన ప్రవల్లిక ఫిర్యాదు చేస్తూ తన భర్త, వారి బంధువులు అదనంగా కట్నం తెమ్మనమని వేధిస్తున్నారని, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ వాస్తవాలను పరిశీలించి, 30శాతం జీతం నుండి ఫిర్యాదికి ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా ఎస్.కోట సిఐను ఆదేశించారు. విశాఖపట్నంనకు చెందిన నరసింగరావు ఫిర్యాదు చేస్తూ తనకు డెంకాడలో భూమి ఉన్నట్లు, సదరు భూమిని శుభ గృహ రియల్ ఎస్టేటు సంస్థవారు ఆక్రమించుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ ఫిర్యాది ఇచ్చిన ఫిర్యాదులో వాస్తవాలను తెలుసుకోవాలని, ఫిర్యాదికి న్యాయం చేయాలని భోగాపురం సిఐను ఆదేశించారు. ఫిర్యాదుల విభాగానికి వచ్చే ఫిర్యాదులను జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను తనకు వెంటనే నివేదించాలని జిల్లా ఎస్పీ జి.పాలరాజు పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ జి. రామకృష్ణ, పోలీసు పిఆర్వో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# గాంధేయం...శరణ్యం



విజయనగరం: నైతిక విలువలు పతనమవుతూ, సమాజంలో దుర్భర పరిస్థితులు తాండ విస్తున్న నేటి పరిస్థితులలో గాంధేయవాదం ఒక్కటే శరణ్యమని ఆర్మ్డ్ రిజర్వు డిఎస్పి ఎ.హనుమంతు అన్నారు. ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారక నిధి జిల్లా అధ్యక్షులు రొంగలి పోతన్న అధ్యక్షతన జరిగిన సంస్థ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కొంతకాలానికి మహాత్మాగాంధీ ఎవరు అనే ప్రశ్న తలెత్తే పరిస్థితులు కనుపిస్తున్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాంధీ జీవితాన్ని విద్యార్ధులకు పాఠ్యాంశాలుగా చేర్చాలని ఆయన కోరారు. అక్టోబరు 2గాంధీ 150 యేండ్ల ఉత్సవాలు నిర్వహణ , విగ్రహాలు ఏర్పాటు వంటి కార్యక్రమాలకు పోలీసు యంత్రాంగం సహకారం ఉంటుందని ఆయన తెలిపారు. సంస్థ జిల్లా కన్వీనరు డా॥ పారినాయుడు మాట్లాడుతూ ఉత్సవాలు సందర్భంగా జిల్లాలో ఒకే రోజు వెయ్యి విగ్రహాలు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ప్రతి పాఠశాలలో మహాత్మాగాంధీ విగ్రహాలు, చిత్రపటాలు ఏర్పాటు చేస్తామన్నారు. దాతల సహకారంతో విగ్రహాలు నెలకొల్పుతామన్నారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు పెద్దింటి అప్పారావు, కె.ఆర్.డి.ప్రసాద్,పివి నరశింహరాజు, త్రినాద్‌ప్రసాద్, మహమ్మద్ గౌష్‌భాషా. పి.భాషా, పి.అప్పలనాయుడు, కడలి ప్రకాశరావు, బసవ మూర్తి, చిన్నంనాయుడు, గోపాల కృష్ణ, గంగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా చిన్నయ్య నియామకం.

ఆంధ్రప్రదేశ్ గాంధీస్మారకనిధి జిల్లాప్రధాన కార్యదర్శిగా రిటైర్డు డిప్యూటీ తహశీల్దారు సి.హెచ్.చిన్నయ్య, కార్యదర్శిగా పాడుపురెడ్డి అప్పలనాయుడులను నియమిస్తూ జిల్లా కన్వీనరు డా॥ పారినాయుడు అద్యక్షులు రొంగలి పోతన్నఉత్తర్వులు జారీ చేశారు.

## మొదటి పేజీ తరువాయి

## అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయాలి

కర్నూలు జిల్లాలోనే 1600 క్వారీలకు అనుమతులు ఇచ్చారని అన్నారు. 600 వరకు అక్రమ క్వారీలు నడుస్తున్నాయని స్థానిక యువత తన దృష్టికి తీసుకొచ్చినట్లు పవన్ తెలిపారు. క్వారీ సమస్యలపై త్వరలోనే స్పందిస్తానని పేర్కొన్నారు.

## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ

పోలీసులు మావోయిస్టు ప్రాబల్య అటవీ ప్రాంతాల్లో బేస్ క్యాంపులు ఏర్పాటు చేసుకుని కూంబింగ్ నిర్వహిస్తున్నారు. బేస్ క్యాంపులను కేంద్రంగా చేసుకుని మావోయిస్టుల ఉనికిపై ఎప్పటికప్పుడు నిఘా వేస్తున్న పోలీసు బలగాలు.. సోమవారం నాటి ఎన్‌కౌంటర్‌ను విజయవంతంగా పూర్తి చేయగలిగారు. సంఘటనా స్థలంలో 16 ఆయుధాలు, మరికొన్ని నాటు తుపాకులు కూడా స్వాధీనం చేసుకున్నారు.

మావోయిస్టులకు గట్టిదెబ్బ..

గత నెలలో బీజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 8మంది మావోయిస్టులు మృతిచెందిన సంగతి తెలిసిందే. వరుస ఎన్‌కౌంటర్లతో తీవ్రంగా నష్టపోయి తమ ఉనికి ప్రశ్నార్థకంగా మారిన వేళ.. తాజా ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టులకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది. మావోయిస్టుల వారోత్సవాలు ముగిసిన కొద్ది రోజుల్లోనే ఈఘటన చోటుచేసుకోవడం గమనార్హం. అయితే, మావోయిస్టులు కూడా ప్రతీకార దాడులకు పాల్పడే అవకాశం ఉన్నందున భద్రతా బలగాలు అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు.

## ప్రత్యేక నిధులేవీ!?

పూరితంగా వ్యవహరిస్తోందనడానికి యూసీలు అందలేదని పార్లమెంట్ సాక్షిగా కేంద్రం అబద్దాలు చెప్పడమే అందుకు నిదర్శమని తెదేపా ఎంపీలు స్పష్టం చేశారు. జీవీఎల్ నరసింహారావు ఎలాంటి ఆధారాలూ లేకుండా ఆరోపణలు చేస్తున్నారని, ప్రచారం కోసం ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం తగదని జేసీ దివాకర్ రెడ్డి, మురళీమోహన్ అన్నారు.

## అవయవదానానికి ముందుకొచ్చిన చంద్రబాబు

తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం వివరించారు. నాణ్యమైన విద్యుత్ ఇప్పుడు రూ.5కే లభిస్తోందని, దీన్ని రూ.1.50 నుంచి రూ.2కి తగ్గించగలిగితే అద్భుతాలు సృష్టించవచ్చని ఆయన అన్నారు. విద్యుత్‌ని అతి తక్కువ ధరకు ఎలా ఇవ్వగలమనే దానిపై విద్యార్థులు ఆలోచనలు చేయాలని పిలుపునిచ్చారు.

***అవయవదానానికి 1.20 లక్షల మంది***

అవయవ దానం చేసేందుకు తాను సిద్ధమని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజావేదిక హాల్‌లో ప్రకటన చేశారు. అవయవ దానాన్ని పాఠ్యాంశాల్లో ఒక అంశంగా పెడతామని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్‌లో అవయవదానం ఒక షరతుగా పెట్టే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. పది రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు స్వచ్ఛందంగా లక్షా ఇరవై వేల మంది అవయవ దాతలు ముందుకు వచ్చారు. వారికి ఇచ్చిన పత్రాలను ముఖ్యమంత్రి సమక్షంలో జీవన్‌దాన్ సంస్థకు మెప్మా అందజేసే కార్యక్రమం ప్రజావేదిక వద్ద నిర్వహించారు. దిల్లీకి చెందిన ఆ సంస్థ ప్రతినిధి రాకేష్ వర్మ ఇండియా బుక్ అఫ్ రికార్డ్స్‌లోకి ఈ చారిత్రక ఘట్టాన్ని నమోదు చేస్తున్నట్టు ప్రకటించారు. తన పిలుపునకు స్పందించి ఇంతమంది ముందుకు రావడంపై ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తంచేశారు.

## గెలుపు మనదే

వైయస్ జగన్ పాదయాత్రను చూసే పార్టీలో చేరినట్లు స్పష్టం చేశారు. ఏపీలో వైయస్సార్‌సీపీ విజయం సాధించడానికి తన వంతు కృషి చేస్తానని కృష్ణుడు తెలిపారు.

వైయస్ జగన్ ముఖ్యమంత్రి కావాలి

చోటా కే నాయుడు

ఇది ఇలా ఉండగా, తూర్పుగోదావరి జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి 230వ రోజు ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభమైంది. జగన్ తన 230వ రోజు పాదయాత్రను ప్రత్తిపాడు నియోజకవర్గం కత్తిపూడి క్రాస్ నుంచి ప్రారంభించారు. పాదయాత్ర నెల్లిపూడి, శ్రీశాంతి ఆశ్రమం మీదుగా శంఖవరం వరకు కొనసాగనుంది.

## మృతుల కుటుంబాలకు ఐదు లక్షల పరిహారం

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తీసుకుంటామని తెలిపారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఇంజెక్షన్ వికటించి ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

# 'స్వాతి ప్రమోటర్స్'కు అగ్రస్థానం
# 'గుడా' తొలి ఆన్‌లైన్ అప్రూవల్ 'స్వాతి'కే



విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో భాగంగా రియల్ ఎస్టేట్ రంగంలో అగ్రగామిగా ఉన్న స్వాతి ప్రమోటర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అగ్రతాంబూలం దక్కింది. రాష్ట్రంలోని మొట్టమొదటి ఆన్‌లైన్ లేఔట్ అప్రూవల్ 'గోదావరి అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ' (గుడా) స్వాతి ప్రమోటర్స్ సంస్థకు మంజూరు చేసింది గుడా చైర్మన్ గన్ని కృష్ణ సంబంధిత ఉత్తర్వులను ఆ సంస్థ ఎండి మేడపాటి రమేష్ రెడ్డికి జారీచేశారు. ఈ విషయాన్ని రమేష్‌రెడ్డి ఒ ప్రకటనలో మీడియాకు తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా బిల్డింగ్స్ అండ్ లేఔట్స్‌కి ఆన్‌లైన్ విధానం ద్వారా ఆమోదించే విధానాన్ని తీసుకురావడం జరిగింది.

రాష్ట్రంలో ఉన్న అన్ని యుడిఎ లు, టౌన్ ప్లానింగ్‌లు ఈ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చాయి. మార్చి నుండి ప్రవేశపెట్టిన గుడాలో పలువురు లేఔట్ అప్రూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ రాష్ట్రంలో మొట్టమొదటి అప్రూవల్ తీసుకున్న ఘనత మా సంస్థకే దక్కడం ఆనందదాయకం అన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గన్ని కృష్ణకి, వైస్ చైర్మన్ అమరేంద్ర కుమార్‌కి మరియు గుడా సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## హోలీటెక్ కంపెనీతో ఏపీ సర్కార్ ఒప్పందం

**అమరావతి : నవ్యాంధ్రకు పెట్టుబడులు క్యూ కడుతున్నాయి. తాజాగా ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తి సంస్థ హోలీటెక్ ఏపీ సర్కార్‌తో**

తరువాయి 7లో..

**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION**
VIZAG ...ahead
'e' Procurement Short Tender Notice No.30/2018-19/E.E-II/DB, Dt:06-08-2018

| | | |
|---|---|---|
| 01. | Number of Works | : 1 No |
| 02. | Value of Works (ECV) | : Rs.17.20 Lakhs |
| 03. | Down Loading Starting Date | : 06-08-2018 @ 11.00 PM |
| 04. | Down Loading End Date | : 14-08-2018 @ 2.00 PM |
| 05. | Last date of submission of Bid | : 14-08-2018 @ 3.00 PM |
| 06. | Date of opening Tenders | : 14-08-2018 @ 4.00 PM |

Note:For any other details required in respect of above tender notice, please contact EE-II before applying for tender schedules and visit us: @ www.apeprocurement.gov.in.
For COMMISSIONER
స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ విశాఖ
ఇంటింట మరుగుదొడ్డి - బహిరంగ మల విసర్జనకు స్వస్తి

### మధ్యాహ్నభోజన కార్మికుల

# అక్రమ అరెస్టులకు నిరసనగా రాస్తారోకోలు

### సిఐటియు డిమాండ్

విశాఖపట్నం : మధ్యాహ్నభోజన పథకాన్ని ప్రైవేట్‌పరం చేయరాదని తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 6న ఛలో విజయవాడకు వెళ్ళిన మధ్యాహ్నభోజనం పథకం కార్మికులను ఈ రోజు ఛలో విజయవాడలో అక్రమంగా ఎక్కడికక్కడ అరెస్టులు చేసి కార్మికులను భయభ్రాంతులకు గురిచేయడాన్ని సిఐటియు విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. దీనికి నిరసనగా నేడు అన్ని మండలాల్లో రాస్తోరోకోలు నిర్వహించాలని సిఐటియు పిలుపు నిచ్చింది.

చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్నభోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తుంది. దీని వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 50వేల మంది మధ్యాహ్నభోజన కార్మికులు ఉపాధిని కోల్పోతారు. గత 14ఏళ్ళుగా చాలిచాలనీ వేతనాలతో మహిళలు వండి వడ్డిస్తున్నారు. నెలల తరబడి బిల్లులు బకాయి వున్నా అప్పులు చేసి వంట నిర్వహణ చేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం అర్ధాంతరంగా వీరి ఉపాధిని దెబ్బకొడుతుంది. తమ సమస్యలు పరిష్కారం కోసం విజయవాడలో శాంతియుతంగా ఆందోళనకు వెళ్తున్న కార్మికులను అక్రమంగా అరెస్టులు చేయడం అన్యాయం. జిల్లా అధ్యక్షురాలు ప్రసన్నను ఇంటి వద్దనే అరెస్టు చేశారు. పద్మనాభం మండలంలో పొలం పనుల్లో వున్నవారిని కూడా స్టేషన్‌కు తీసుకొచ్చారు. ప్రజాస్వామ్య దేశంలో తమ సమస్యలు చెప్పుకొనే స్వేచ్ఛ అందరికీ వుంది. చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేకహోదా కోసం రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నది. అటువంటిది మధ్యాహ్నభోజన కార్మికులను తమ సమస్యలు చెప్పుకోకుండా నిరంకుశంగా ఉద్యమాన్ని అణిచివేయడం సరైనదికాదు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మధ్యాహ్నభోజన పథకాన్ని ప్రైవేట్‌పరం చేసే విధానాలను విరమించాలి. కార్మికుల ఇతర సమస్యలు పరిష్కరించాలని సిఐటియు డిమాండ్ చేస్తుంది.

# ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువయేలా కృషి చేయండి

### ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలిసేలా ప్రచార వాహనం ఏర్పాటు ....

### ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్ రాజు ....



కంచరపాలెం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఉపయోగ పడేవిధంగా ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ య్యేలా కృషి చేయాలని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్ రాజు బీజేపీ వార్డు అధ్యక్షులకు సూచించారు. ఈమేరకు జీవీఎంసీ 37 వ వార్డు పరిది రాంజీ ఎస్టేట్స్ వద్ద 18 లక్షల వ్యయంతో 37 మీటర్ల మేర నిర్మించనున్న గెడ్డ రక్షణ గోడ నిర్మాణ పనులకు సంబందించి సోమవారం ఉదయం శంకుస్థాపన చేసిన ఆయన వార్డులో సమస్యలను స్థానికులకు అడిగి తెలుసుకున్నారు . ఈసందర్భంగా ఆయన మాట్లడుతూ నియోజక వర్గం పరిది లో ప్రజలకు ఎటువంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. అదేవిదంగా ప్రభు త్వాలు ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు పూర్తి స్థాయిలో అవగహన కల్పించే విదంగా చర్యలు చేపడుతున్నా మన్నారు. అందులో బాగంగా ప్రచార వాహనాన్ని వినియోగించుకోవాలని బీజేపీ వార్డు అధ్యక్షులకు సూచించారు . నియోజవర్గం పరిది వార్డు ల వారీగా సంక్షేమ పథకాల వినియోగంపై స్థానిక ప్రజలకు వివరించాలన్నారు. కార్య క్రమంలో జీవీఎంసీ ఈ .ఈ నర్సింహరావు, ఎ.ఈ వెంకటలక్ష్మి , బీజేపీ వార్డు అద్యక్షుడు జి.అరుణ్ బాబు,బీజేపీ నగర యువజన విభాగం కార్యవర్గ సభ్యులుబెవర శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


# భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణ పనులు ఎఎఐకి అప్పగించాలి

### జిఎంఆర్‌కు ఇచ్చే ఆలోచన ఉపసంహరించుకోవాలి









విశాఖపట్నం : భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణ పనులను దక్కించుకున్న ఎయిర్ పోర్టు ఆధారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) ఒప్పందాన్ని రద్దు చేసి ప్రైవేట్ సంస్థ జిఎంఆర్‌కు కట్టబెట్టేందుకు ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఫ్రీ అప్లికేషన్ కాన్ఫెరెన్స్‌ను రద్దు చేయాలని తాజ్ హోటల్ (గేట్‌వే) వద్ద ఆందోళన చేసిన సిపిఎం నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. ప్రజాధనాన్ని ప్రైవేట్ కంపెనీలకు ధారదత్తం చేసే నిర్ణయాలను చేయడంపై నిరసన వ్యక్తం చేస్తున్న పార్టీ నాయకులను, పోలీసులు ఈడ్చుకెళ్ళి వాహనాల్లో మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థ ఎఎఐ ను కాదని ప్రైవేట్ సంస్థ జిఎంఆర్ కు భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణ పనులు అప్పగిస్తూ రాష్ట్ర మంత్రివర్గం చేసిన నిర్ణయంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

రానున్న ఎన్నికల్లో ముడుపులు తీసుకొని ఎన్నికల్లో ఖర్చు చేసి లబ్ధిపొందడం కోసం జిఎంఆర్‌కు నిర్మాణ పనులు ప్రభుత్వం అప్పగిస్తుందని విమర్శించారు.

పరిశ్రమల కంటే పరిశ్రమాధిపతుల నుంచి కమీషన్లు కొట్టడానికి చంద్రబాబు ఎక్కువ శ్రద్ధచూపుతున్నారని ఆరోపించారు. కమీషన్ల కోసం కక్కుర్తిపడి ఎఎఐను కాదని, బ్యాంకులకు 10వేల కోట్ల రుణం ఎగ్గొట్టిన ప్రైవేట్ సంస్థ జిఎంఆర్ కు భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణ పనులు అప్పగించడం క్షంతవ్యం కాదన్నారు. జిఎంఆర్ కంటే రెవెన్యూ షేర్‌గాని, లీజులు చెల్లించడంలో ఎఎఐ అధనపు లాభాలు చూపించినా జిఎంఆర్ సంస్థకు పనులు కట్టబెట్టాలనుకోవడం దుర్మార్గమని అన్నారు. బోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణ పనులను ఎఎఐకు అప్పగించాలని డిమాండ్ చేశారు. జిఎంఆర్‌కు ఎయిర్ పోర్టు పనులను అప్పగిస్తూ చేసిన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే రాజకీయ పార్టీలను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అరెస్టు అయిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.నరసింగరావుతో సహా నగర కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు, సిపిఎం నాయకులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, పి.మణి, ఎస్.జ్యోతీశ్వరరావు, ఎం.సుబ్బారావు, ఆర్.పి.రాజు, బేగం, పి.వెంకటరావు, ఐద్వా నగర కార్యదర్శి జి.ప్రియాంక తదితరులు వున్నారు.

## ఎమ్‌పిఎమ్ ట్రస్టు ఆధ్వర్యంలో పుస్తకాల వితరణ



సాగర్‌నగర్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి సభ్యులు, పార్లమెంట్ మాజీ సభ్యులు డాక్టర్ ఎమ్.వి. వి.ఎస్. మూర్తి ఆధ్వర్యం లోని ఎమ్.పి. ఎమ్ ట్రస్టు మరియు ఎన్‌టిఆర్ సేవా సమితి ట్రస్టుల ఆద్వర్యంలో స్థానిక మ ధు ర వా డ లో ని చంద్రపాలెం జిల్లాపరి షత్ పాఠశాల విద్యార్థులకు సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు.పాఠశాలలోని 3500 మంది విద్యార్థులకు ఒకొక్కరికి 7 పుస్తకాల చోప్పున 24 వేల పుస్తకాలను పంపీణీ చేసినట్లు ఎమ్.పి.ఎమ్ ట్రస్ట్ నిర్వాహకులలో ఒకరైన ఆళ్ళ శ్రీనివాసు తెలిపారు.కాగా మధురవాడ సహయి పోలీసు కమిషనర్ బి.నాగేశ్వర రావు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు టి.ఎస్.ఆర్.ప్రసాద్ చేతుల మిదుగా విద్యార్థులకు ఈ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాద్యాయుడు రాజాబాబు, మధురవాడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జివిఎంసి గ్రీవెన్సుకు 229 ఫిర్యాదులు



విశాఖపట్నం : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్సుడేలో మొత్తం 229 ఫిర్యాదులు అందాయి. కమిషనర్ హరినారాయణన్ ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందిన మొత్తం 229 పిర్యాదులలో ప్రధాన కార్యాలయానికి సంబంధించి 54 ఫిర్యాదులు అందాయి. ఒకటవ జోన్ కు సంబంధించి 14, రెండవ జోన్‌కు సంబంధించి 52, ఐదవ జోన్‌కు సంబంధించి 97, ఆరవ జోన్‌కు సంబంధించి 12 ఫిర్యాదులందాయి. వీటిలో టౌన్‌ప్లానింగ్ విభాగంకు సంబం ధించి 33, ప్రజారోగ్యవిభాగానికి సంబంధించి 17, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 80, హార్టికల్చర్ విభాగానికి సంబంధించి రెండు, యుసిడి విభాగానికి సంబంధించి 5, ఎలక్షన్ విభాగానికి సంబంధించి రెండు, అదనపు కమిషనర్ (జనరల్)/సి సెక్షన్ విభాగానికి సంబంధించి ఒకటి, డిప్యూటి కమిషనర్ రెవిన్యూ విభాగంకు 54, ఇతరులకు సంబంధించి 35 పిర్యాదులు అందాయి.

# జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం పోస్టర్లను ఆవిష్కరించిన

### జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్



విశాఖపట్నం : ఈ నెల 10వతేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె) పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1 నుండి 18 సంవత్సరాల వయస్సు గ పిల్లలందరికి తప్పనిసరిగా నులిపురుగుల మాత్ర అల్బండోజోల్‌ను మిగించాలన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలలో ఈ మాత్రల పంపిణీని చేపట్టాలన్నారు. ఎఎన్‌ఎం, ఆశా, అంగన్వాడీ వర్కర్లు, డిఆర్‌డిఎ స్వయం సహాయక సంఘాలు, మెప్మా, పంచాయితీ సిబ్బంది ఆయా గ్రామాలు, వార్డులలో పర్యటించి మాత్రల పంపిణీని చేపట్టాలన్నారు. సాంఘీక, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమ, రెసిడెన్షియల్ వసతి గృహాలలో విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేయాలన్నారు. మండలాధికారులు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు గ్రామదర్శిని పర్యటనలో భాగంగా పర్యవేక్షించాలన్నారు. మాత్రలు తీసుకొని మిగిలిపోయిన పిల్లలకు ఆగస్టు 14వతేదీన మాత్రలను ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినము వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

డెంగ్యూ వ్యాధి అరికడదాం - డ్రైడేని పాటిద్దాం ప్యాంప్లెట్స్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

డెంగ్యూ, మలేరియా వ్యాధుల పెరుగుదలను నిరోధించడానికి వారంలో ఒక రోజు నీటి నిల్వల పాత్రలను ఖాళీ చేసి డ్రైడేని పాటించాల్సిందిగా జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ సూక్ష్మనీటి సాగు పథకం కరపత్రాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

ఉద్యానవన శాఖ ద్వారా నిర్వహిస్తున్న సూక్ష్మ నీటిసాగు పథకం బిందుసేద్యంనకు సంబంధించిన కరపత్రాలను జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకానికి సంబంధించి పరికరాలు కొనుగోలు నిమిత్తం రైతులకు రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.సృజన, జెసి-2 డా.సిరి, డిఆర్‌ఓ చంద్రశేఖరరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.రమేష్, శైలజ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డెంగూ కేసులు పెరగకుండా నివారణ, నిర్మూలన చర్యలు

### - కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం :- నగర పరిధిలో డెంగీ కేసులు పెరగకుండా నివారణ, నిర్మూలన చర్యలు చేపట్టలని జివిఎంసి కమిషనర్ హరినారాయణన్ ఆదేశించారు. కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మలేరియా, జివియంసి అధికారులు, ప్రత్యేక అధికారులతో సోమవారం ఆయన సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. అక్టోబరు నెలాఖరు వరకు డెంగీ వ్యాధి వ్యాప్తి చెందకుండావిస్తృత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జివియంసి అధికారులు, సిబ్బంది, మలేరియా, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని కోరారు. ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలు, ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల సేవలను వినియోగించుకోనేలా ప్రజలను చైతన్యవంతం చేయడం ద్వారా కె.జి.హెచ్ పై భారం పడకుండా ఉత్తమ వైద్య సేవలు పొందేలా చూడాలని పేర్కొన్నారు. ఇంటిలో నీరు నిల్వ లేకుండా, బయట కాలువలలో మురుగు నిల్వ ఉండకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వారానికి ఒకసారి ఇంటిని పరిశుభ్రం చేసుకోవడంతో బాటు పనికిరాని వస్తువులు, సీసాలు తదితరాలను తొలగించాలని, నీటిని పారబోసి డ్రైడే పాటించడం ద్వారా "డెంగీ" ప్రబలకుండా నివారించవచ్చునని పేర్కొన్నారు.

డెంగీని నిర్లక్ష్యం చేయకుండా వైద్య సేవలు పొందడం ద్వారా వ్యాధి నివారణకు దోహదపడుతుందని వెల్లడించారు. డెంగీ ప్రాణాంతకం కాదని పేర్కొన్నారు. ప్రతిరోజు ఒక గంటపాటు జోనల్, వార్డు ప్రత్యేక అధికారులు పర్యటించి పర్యవేక్షించి పరిశీలన ద్వారా ప్రజలను అప్రమత్తం చేయడం ద్వారా ఆశించిన లక్ష్యాన్ని సాధించవచ్చునని పేర్కొన్నారు.

# మీ కోసం (ప్రజావాణి 305 దరఖాస్తులు)



విశాఖపట్నం: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన మీ కోసం (ప్రజావాణి) కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తమ వినతులను అధికారులకు సమర్పించారు. మీ కోసం కార్యక్రమానికి 305 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జాయంట్ కలెక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ 2 డా.సిరి, డిఆర్‌ఒ చంద్రశేఖరరెడ్డి, మీ కోసం కార్యక్రమంలో పాల్గొని పలు ప్రాంతాల నుండి వచ్చిన వారి నుండి స్వయంగా వినతులను స్వీకరించారు. గృహాలు, రేషన్‌కార్డులు, భూమి వివాదాలు, పింఛన్ల మంజూరు మరియు ఇతర సమస్యలకు సంబంధించిన విజ్ఞాపన లను సమర్పిం చారు. మీ కోసం కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**డయల్ యువర్ కలెక్టర్‌కు 16 ఫోన్‌కాల్స్ :**

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం 16 ఫోన్ కాల్స్ ద్వారా బాధితులు తమ వినతులను విన్నవించుకున్నారు. జెసి-2 డా.సిరి ఫోన్‌కాల్స్ స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## *డయల్ యువర్ కమిషనర్‌కు 12 ఫిర్యాదులు*



విశాఖపట్నం, :- జి.వి.యం.సి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ (నెంబరు 1800-4250-0009) కార్యక్రమానికి 12 ఫిర్యాదులు అందాయి. అదనపు కమిషనర్ (ప్రాజెక్టులు) టి సకలారెడ్డి డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి హాజరై పలువురి నుండి వచ్చిన ఫోన్ కాల్స్‌కు సమాధానం చెప్పారు. ఇందులో ఒకటవ జోన్‌కు సంబంధించి ఒకటి, రెండవ జోన్‌కు సంబంధించి ఒకటి, మూడవ జోన్‌కు సంబంధించి రెండు, నాలుగవ జోన్‌కు సంబంధించి ఒకటి, ఐదవ జోన్‌కు సంబంధించి నాలుగు, ఆరవజోన్‌కు సంబంధించి మూడు ఫిర్యాదులు అందాయి. సంబంధిత అధికారులు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి మూడురోజులులోగా నివేదిక సమర్పించాలని కోరారు.

# విజయభాను సంపాదకీయం

## బాలికల చెర నీచకృత్యం

తోటి మానవులను బానిసలుగా మార్చి వారి శరీరాలతో సొమ్ము చేసుకోవడమనే అత్యంత నికృష్ట వ్యవస్థ ఇంకా ఉనికిలో ఉండటం సభ్య ప్రపంచం సిగ్గుపడాల్సిన విషయం. యాదగిరిగుట్ట ప్రాంతంలో అమాయక బాలికలను చెరపట్టి డబ్బు సంపాదించే ముఠా కార్యకలాపాలు ఇటీవల పోలీసులు దాడి చేయడంతో బయటపడ్డాయి. ఈ ముఠా సాగిస్తున్న నీచకృత్యాన్ని చెప్పడానికే సభ్య భాషలో పదాలు లభించవు. అటువంటిది వీరు ముక్కుపచ్చలారని బాలికలను కొనుక్కొచ్చి వ్యభిచార కూపంలోకి దించుతున్న తీరు మరింత హృదయవిదారకంగా ఉన్నది. పేద అమాయక తల్లిదండ్రులకు తాము పెంచుకుంటామని మాయమాటలు చెప్పి కొనుక్కు రావడం లేదా అపహరించడం ద్వారా కొందరు ఏజెంట్లు పిల్లలను ఈ వ్యభిచారం నిర్వాహకులకు చేరవేస్తున్నారు. ఇక అప్పటి నుంచి చిన్నారులది నరక యాతనే. వయసును మించి ఎదగడానికి హార్మోన్ల ఇంజెక్షన్లు ఇవ్వడం, వారి శరీరాలను అంగట్లో పెట్టడం (వ్యాపారం అనే మాట కూడా దీనికి తగదు) వినడానికే హృదయం తరుక్కుపోయేదిగా ఉన్నది. సమాజానికి అనుమానం రాకుండా, వీరిని తమ పిల్లలుగా నమోదు చేయించి బడికి పంపడంతో పాటు పోలీసులు దాడి చేసినప్పుడు దొరకకుండా నేలమాళిగలు నిర్మించడం వంటి కార్యకలాపాలు గమనిస్తే ఈ ముఠా ఎంతగా పాతుకుపోయి ఉన్నదో తెలుస్తున్నది. యాదగిరిగుట్ట ప్రాంతంలో జరిపిన దాడులలో పోలీసులు పదిహేను మంది పిల్లలకు విముక్తి కలిగించారు. హైదరాబాద్ శివారుల్లో కూడా ఈ ముఠా పిల్లలను పెంచుతున్నదనే అనుమానాలు ఉన్నాయి. ఇటువంటి ముఠాలు ఇంకా ఎన్ని ఉన్నాయో తెలువదు. పల్లెటూళ్ళలో, పట్టణ ప్రాంతాలలో ఏజెంట్లను నియమించుకొని ఎంతో కాలంగా భారీ ఎత్తున కార్యకలా పాలు సాగిస్తున్నా, ప్రభుత్వాలు ఇంతకాలం ఈ ముఠాలను ఎందుకు నిర్మూలించలేకపోయాయనేది ఆలోచించవలసిన అంశం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మన ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్ని రకాల అక్రమ కార్యకలాపాలపై దృష్టి సారించింది. గుడుంబా తయారీ, పేకాట మొదలైన వాటిని అరికట్టింది. నకిలీ విత్తనాలు మొదలుకొని ఆహార పదార్థాల కల్తీ వరకు అనేక ముఠాల ఆటకట్టింది. ఇదే రీతిలో మానవ అక్రమ రవాణా, నయా బానిసత్వంపై కూడా దృష్టి సారించింది. మానవుల అక్రమ రవాణా రెండు కారణాలతో సాగుతున్నది. మగవారిని తరలించి బలవంతపు కూలీలుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. బాలికలను లైంగిక కార్యకలాపాలకు వాడుకుంటున్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత పోలీసులు పెద్ద ఎత్తున సోదాలు నిర్వహించి హైదరాబాద్ పాతబస్తీలో అనేకమంది బాల కార్మికులకు విముక్తి కలిగించారు. వీరిలో బీహార్ తదితర రాష్ట్రాల నుంచి పట్టుకొచ్చిన బాల లు కూడా ఉన్నారు. మూడేండ్ల కిందట అంతర్రాష్ట్ర ముఠా కార్యకలాపాలు సంచలనం కలిగించాయి. ఈ ముఠా దాదాపు 72 మందిని విశాఖపట్నం నుంచి రైలులో తరలిస్తుండగా పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. వీరిలో అసోం, పశ్చిమ బెంగాల్, ఒడిషా, జార్ఖండ్, బీహార్ తదితర రాష్ట్రాల వారు కూడా ఉన్నారు. పెద్ద వయసు వారు కూడా వీరిలో ఉన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశపెట్టి వీరిని తరలిస్తున్నారు. అమెరికా, యూరప్ దేశాలతో సహా ప్రపంచవ్యాప్తంగా ఈ అమానుష కార్యకలాపాలు సాగుతున్నాయి. యూనిసెఫ్ సమాచారం ప్రకా రం- ప్రపంచ వ్యాప్తంగా రెండు కోట్ల మందికి పైగా అక్రమ రవాణా సాగుతున్నది. అక్రమరవాణా బాధితులలో సగానికి పైగా మహిళలే. ఇరువై ఒక శాతం మగవారు. వీరిని బానిసలుగా మార్చి నిర్బంధ చాకిరీ చేయించుకోవడానికి తరలిస్తున్నారు. చిన్న పిల్లలలో 20 శాతం బాలికలు, ఎనిమిది శాతం బాలకులున్నారు. మన దేశంలోని అక్రమ తరలింపులో పది శాతం మందిని విదేశాలకు తరలిస్తున్నారు. తొంభై శాతం మంది దేశంలోనే నికృష్ట జీవనం గడుపుతున్నారు. మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి ఇటీవలే లోక్‌సభలో ఒక బిల్లును ప్రభుత్వం ప్రవేశ పెట్టడంతో, మన దేశంలో ఈ నీచ కార్యకలాపాలను అరికట్టే దిశగా చర్యలు తీసుకుంటారనే ఆశాభావం వ్యక్తమవుతున్నది. ఈ బిల్లుపై కొన్ని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నప్పటికీ, మానవ అక్రమ రవాణాను నిరోధించే లక్ష్యం విషయంలో ఒక ముందడుగుగా చెప్పవచ్చు. అక్రమ రవాణాను నిరోధించడం, బాధితులకు భద్రత, పునరావాసం కల్పించడం మొదలైన అంశాల పై ఈ బిల్లు దృష్టి సారించింది. దోషులకు పదేండ్లు మొదలుకొని యావజ్జీవ కారాగారం విధించడానికి ఈ బిల్లు ఆస్కారం కలిగిస్తున్నది.

# ఫిషింగ్ హార్బర్ బంద్ ప్రశాంతం




విశాఖపట్నం : స్పీడ్ బోట్లను నిషేధించాలని డిమాండ్ చేస్తూ మరపడవల యజమానులు సోమవారం ఫిషింగ్ హార్బర్ బంద్‌ను పాటించారు. దీంతో ఫిషింగ్ హార్బర్‌లో కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఎక్కడి బోట్లు అక్కడే నిలిచిపోయాయి. దుకాణాలు మూసివేశారు. చేపల బజార్ కూడా మూతపడింది. మరప డవల యజమానుల ధాటికి తలొగ్గిన అసోసియేషన్లు దిగిరాక తప్పలేదు. రాష్ట్ర మత్స్యశాఖ కార్యాలయం ఎదుట మరపడవల యజమానులు భారీ ధర్నాను నిర్వహించారు. స్పీడ్ బోట్లు నిషేధించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అయితే హార్బర్‌లో 42 స్పీడ్ బోట్లు ఉండగా ఒక యజమాని వాసుపల్లి పోలిశెట్టి తన స్పీడ్ బోటును వేటకు పంపేది లేదని స్పష్టం చేయడంతో మరపడవల యజమానులు కరతాల ధ్వనులు చేశారు. మిగిలిన యజమానులు కూడా స్పీడ్ బోట్లను నిలిపి వేయాలని వారు డిమాండ్ చేశారు. 280 హార్స్ పవర్ వరకు ఇంజన్లు వాడ్డం వల్ల సాదాసీదా మరపడవల్లో చేపలు, రొయ్యలు పడడం లేదు. దీంతో పెట్టుబడికి తగిన రాబడి లభించకపోవడంతో యజ మానులు లబోదిబోమంటున్నారు. స్పీడ్ బోట్లు తెచ్చే చేపలు కొనుగోలు చేయరాదని, ఐస్ వేయరాదని, స్పీడ్ బోట్ల అహంకారానికి అడ్డుకట్ట వేయాలని మరపడవల యజమానులు డిమాండ్ చేశారు. ఇండస్ట్రీ అభివృద్ధికి మూడు యూనియన్లు పాటుపడాలని అన్నారు. బోటు యజమానులు మున్నం బాలాజీ, ఎస్.రాము, వై.శ్రీనివాసరావు, దూడ ధనరాజ్, వాసుపల్లి లక్ష్మణరావు తదితరుల సారధ్యంలో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో మరపడవల యజమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మరపడవల సంఘాలు ఇంతవరకు రెండు పడవలపై కాలు వేసినప్పటికీ సోమవారం నాటి బంద్, ధర్నా నేపథ్యంలో రాష్ట్ర మరపడవల సంఘం అధ్యక్షులు పి.సి. అప్పారావు, వైశాఖి డాల్ఫిన్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ మూర్తి, పోస్టల్ ఫిషింగ్ బోటు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బర్రి కొండబాబులు ఆందోళనకు మద్దతు పలికి ధర్నాలో పాల్గొన్నారు. మరపడవల యజమానులు చేపడుతున్న ఆందోళన శాంతియుతంగా కొనసాగించాలని వారు ఆకాంక్షించారు. ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి మత్స్యశాఖ ఏడీ లక్ష్మణరావు మాట్లాడుతూ స్పీడ్ బోట్లపై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం తమకు లేనప్పటికీ వారిలో పరివర్తన తీసుకువచ్చి స్పీడ్ బోట్లను వెనక్కు తీసుకునే విధంగా ఒత్తిడి తెస్తామని చెప్పారు. అయితే హెచ్.పి. ఇంజన్లకు సంబంధించి ప్రభుత్వం ఒక చట్టాన్ని తెచ్చేందుకు కసరత్తు మొదలుపెట్టిందని ఒకటి, రెండురోజుల్లో ఇందుకు సంబంధించి స్పష్టత రానుందని తెలియజేశారు. మత్స్యకారుల ఉపాధితో పాటు కన్జర్వేషన్ తమకు ముఖ్యమని మత్స్య పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వారి సంక్షేమం కోసం అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. స్పీడ్ బోట్లపై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం తమకు లేనప్పటికీ వాటిని నియంత్రించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు. మత్స్యశాఖ ఎఫ్‌డీఓ విజయ మాట్లాడుతూ స్పీడ్ బోట్లపై ఆంక్షలు విధించడంపై మత్స్యశాఖ కమిషనర్ జారీ చేసే ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నామని చెప్పారు. స్పీడ్ బోట్ల వల్ల తక్కువ హార్స్ పవర్ ఇంజన్లతో వేట సాగిస్తున్న బోట్లకు తగినంత క్యాచ్‌మెంట్ లభించడం లేదన్నారు. ముఖ్యంగా ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఈ పరిస్థితి ఉత్పన్నమైందని తీరం కలుషితం కావడం కూడా ఇందుకు మరొక కారణమన్నారు.

# పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలను అందించాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మినారాయణ

గొలుగొండ : పుట్టిన బిడ్డకు తల్లిపాలు వెంటనే అందించడం ఆరోగ్యంగా ఉండేందుకు శ్రేయస్కరమని గొలుగొండ ఎంపిపి సుర్ల లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం గొలుగొండ ఎంపిడిఓ కార్యా లయంలో మండలంలో ఉన్న అంగ న్వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణీ లకు తల్లిపాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు, తల్లు లకు విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నర్సీపట్నం ఐసిడిఎస్ సిడి పిఓ శ్రీకళ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా అనేక రకాల విలువలతో కూడిన విటమిన్లు ఉంటాయని తద్వారా చిన్నారులు ఆరోగ్యవంతంగా జీవిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అంబేద్కర్, ఎంపిడిఓ సువర్ణరాజు, సెక్టార్ సూపర్‌వైజర్ సత్యవతి, విజయలక్ష్మి, అంగన్వాడీ కార్య కర్తలు మంగతాయారు, పోతల విజయ్‌కుమారి, భవాని, రాజకుమారి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# యు.చీడిపాలెంలో జనమైత్రి కార్యక్రమం



కొయ్యూరు : జనమైత్రి కార్యక్రమంలో భాగంగా సోమవారం యు.చీడిపాలెం గ్రామంలో కొయ్యూరు సిఐ ఉదయ్‌కుమార్, మంప ఎస్సై శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో గిరిజనులతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా సిఐ ఉదయ్‌కుమార్, ఎస్సై శ్రీనివాసరావు గిరిజనులను ఉద్దేశించి మాట్లా డుతూ గ్రామంలో శాంతి భద్రతల విషయంలో పోలీసులకు సమాచారం అందించాలని, గ్రామంలో సమస్యలు తెలిపితే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించేలా చేస్తామన్నారు. ఈ సందర్భంగా వృద్దులకు చీరలు, గొడుగులు, సోలార్ లైట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# బడాబాబులు కోరల్లో గెడ్డవాగులు.. పట్టించుకోని అధికారులు

### కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించిన గొల్లపల్లి ప్రభాకర్



సబ్బవరం: సర్వే నెంబరు 260/1లో గెడ్డవాగు భూమి 3 ఎకరములు వుంది. ఈ భూమిని కొంతమంది బడాబాబులు ఆక్రమించుకుని గెడ్డవాగును జేసీబీతో గొయ్యిలను పూడ్చి వేశారని కలెక్టర్‌కి సోమవారం వినతిపత్రం దళిత నాయకులు గొల్లపల్లి ప్రభాకర్ సమర్పించారు. అందులో కబ్జాకు గురైన గెడ్డ వాగు భూమి 3 ఎకరముల భూమి విలువ 3కోట్లు ఉంటుం దని ఆయన ఆరోపించారు. 2017లో ఈ గెడ్డవాగు భూమి గురించి చిట్ అధికారులకు ఫిర్యాదు చేయగా చిట్ అధికారులు కూడా ఆ భూమిని పరిశీలించి వారిపై కేసులు పెడతామని అన్నారని చెప్పారు. ప్రభుత్వ అధికారులు హెచ్చరిక బోర్డులకు వేశారని వాటిని ఖాతరు చేయకుండా గెడ్డ వాగులను కప్పి వేసి ఆ భూమిలో జీడి, మామిడి మరియు కొబ్బరిమొక్కలు వేసి ఆ భూమిని ఆక్రమించారని అన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టి పట్టనట్లు చోద్యం చూస్తున్నారని అన్నారు. అంతేకాకుండా ల్యాండ్ ప్రొడక్షన్ కలెక్టర్ ప్రమీలాగాంధీ కూడా ఫిర్యాదు చేయగా వారు కూడా పరిశీలించి కబ్జాదారులను హెచ్చరిస్తా అన్నారు. ఇటువంటి వ్యక్తులపై పీడీ యాక్టు అమలు చేసి, గెడ్డవాగును కబ్జాకు గురికాకుండా చూడాలని కోరారు. ప్రభుత్వ భూములు కాపాడుకోవాలని కలెక్టర్‌ను గొల్లపల్లి ప్రభాకర్ కోరారు.

# గ్రామ స్వరాజ్ అభియాన్‌కు నిర్దేశించిన లక్ష్యాలను ఆగస్టు 14తేదీ లోపల పూర్తి చేయాలి

### కేంద్ర గ్రామీణాభివృద్ధి స్పెషల్ సెక్రటరీ జయదీప్ గోవింద్



విశాఖపట్నం: కేంద్ర ప్రభుత్వ పథకాలు నీతి ఆయోగ్ ద్వారా అమలు చేస్తున్న ప్రధానమంత్రి గ్రామ స్వరాజ్ అభియాన్‌కు నిర్దేశించిన లక్ష్యాలను ఆగస్టు 14తేదీ లోపల పూర్తి చేయాల్సిందిగా కేంద్ర గ్రామీణాభివృద్ధి స్పెషల్ సెక్రటరీ జయదీప్ గోవింద్ సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పియం ఉజ్వల, సౌభాగ్య, జన్‌ధన్, జెజెబివై, యస్‌బివై, మిషన్ ఇంద్రధనుష్ పథకాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులందరికి సంక్షేమ పథకాలు చేరేవిధంగా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఏస్పి రేషన్ జిల్లాలో భాగంగా విశాఖలో 618 గ్రామాలను ఎక్స్‌టెండ్ గ్రామ స్వరాజ్య అభియాన్ పథకానికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.సృజన, శ్రీనివాస్, రామశాస్త్రి, వేణుగోపాల్, కృష్ణకుమారి, డా.రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కవి సమయం

## జూదం

జీవితమే - ఓ జూదం
గెల్పు - ఓటమిల ఆట
బ్రతుకు బాట ప్రయణంలో
ఎన్నుకొన్న వృత్తి - ప్రవృత్తులలో
ప్రయోజకత్వమో! - అప్రయోజకత్వమో!
వృద్ధియో - వృధాయో!
స్థాపితమో! - సమఃస్థాపితమో! ...॥జీ॥
వృత్తి నిన్ను తిండి పెట్టకపోతేను
ప్రవృత్తికి వెల్తేను.
పాముకాటు వేసేనో!
పగడయైకా, పాడెనో! ...॥జీ॥
ఈ అర్థాంగి అదృష్టమో!
నీ పిల్లల దురదృష్టమో!
నీలలాట తిలకమని
సరిపెట్టుకోవడమో! ...॥జీ॥
ఎదుగుదల ఉంటేను
ఎన్నుపోటుదారులు నిఘా లేసి ఉంటారు
తప్పద్రోవ చూపించి
నీ త్రోవను దోచుకొనేరు
ఆ, పరమార్థం తెల్సుకోలేకుంటే;
ఎదుటవాటి గెల్పుకు నాందివేసే వాడి
వైయ్యేవు
నీ బ్రతుకుబాట-ముళ్లు పోదాయెను ...॥జీ॥

రచయిత
యల్.సిద్ధు
7702977293

# పంచాంగం

మాసం : నిజ జ్యేష్ఠ ; తిథి : ఏకాదశి రా.1.31; రోహిణి ఉ.9.45; మ.వ.3.03ల 4.34.

మంగళవారం 07-08-2018

**మేషం** : ఇతరులకు వాహనం ఇవ్వడంవల్ల ఇబ్బందులను ఎదుర్కొంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. ఉద్యోగరీత్యా దూర ప్రయాణాలు చేయవలసివస్తుంది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడరు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. గృహ నిర్మాణానికి సంబంధించిన ప్లానుకు ఆమోదం లభిస్తుంది.

**వృషభం** : ఉద్యోగస్తులు, రాజకీయనాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. ప్రముఖులతో పరిచయాలు వ్యాపకాలు అధికమవుతాయి. మిత్రులతో కలిసి షాపింగ్ చేస్తారు.

**మిథునం** : ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. బ్యాంకు రుణాలు తీర్చడంతో పాటు కొంత రుణం తీసుకుంటారు. బంధువుల మధ్య సయోధ్య లోపిస్తుంది

**కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు సమర్థంగా పరిష్కరిస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు..

**సింహం** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు.

**కన్య** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి.

**తుల** : స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నవ ములు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తికీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు.

# కార్మికుల సంఘాల సమావేశం

భీమునిపట్నం : కార్మికుల సంఘాల సమావేశం సోమవారం చిట్టివలస వెల్ఫేర్ కళ్యాణ మండపంలో సం సమావేశం నిర్వహించారు. నాయకులు ఇంతకు ముందు యాజమాన్యం దగ్గర జరిగిన చర్చలు వివరాలు కార్మికులకు తెలిపారు. కార్మికుల అభిప్రాయాలు విని 11 వ తేదీ శనివారం యూనియన్స్ సమావేశం మయి ఏకాభిప్రాయం పై 13. వతేది చర్చలకు వెళ్ళడానికి యూనియన్స్ నిర్ణయిం చారు. ఈ సమావేశంలో అన్ని కార్మిక సంఘాలు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## జనసేన కార్యాలయంలో స్నేహితుల దినోత్సవ వేడుకలు

అనకాపల్లి : పట్టణంలో నెహ్రూచౌక్‌వద్ద జనసేన కార్యాలయంలో జనసేన నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం ఆద్వర్యంలో ప్రపంచ స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కార్యకర్తలు, అభిమానులు, స్నేహితులు మధ్య సీతారం కేక్ కట్‌చేసి అందరికీ పంపిణీ చేసారు. అనంతరం స్నేహితులకు విందు ఏర్పాటు చేశారు.

# ప్రభుత్వ భూములను రక్షించండి

### -జోన్-5జెడ్సీకి వినతిపత్రాన్ని అందించిన వైకాపా



గాజువాక: జీవీయంసీ 50,51వ వార్డులోఉన్న ప్రభుత్వభూములను భూకబ్జాదారులనుంచి పరిరక్షించాలని కోరుతూ గాజువాక వైకాపా శ్రేణులు గాజువాక జీవీయంసీ కార్యాలయంలోని జోన్-5 జెడ్సీ చక్రధరరావుకు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయా వార్డు నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్మించిన ఉక్కు నిర్వాసితుల భూములను ఈ మధ్యకాలంలో జీవీయంసీకే స్టీల్ ప్లాంట్ భూములు ఆధీనంలో తీసుకోవడం జరిగిందని అయితే, వాటిని అధికార పార్టీకి చెందిన నాయకులు సమతానగర్ గెడ్డ ప్రక్కనఅలాగే నడుపూరు గెడ్డ ప్రక్కన అలాగే కిరవానిపాలెం, బర్మాకాలనీ పరిసరప్రాంతంలోని భూములను కబ్జాకు గురువుతున్నాయని వాటిన పట్టించుకునే నాధుడు లేడని ఆందోళన వ్యక్తం చేసారు. 62వ వార్డు ధయాళ్ నగర్ కొండప్రాంతంలో ప్రభుత్వ భూములను ఆక్రమించి ఇళ్ళను నిర్మించుకుంటున్నారని వాటిని పరిరక్షించవలసిన భాధ్యత రెవెన్యూ, మరియు, జీవీయంసీ ఉందని, కాని సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రభుత్వ భూములను సంబంధిత అధికారులు భూకబ్జాదారులనుంచి రక్షించాలని కోరుతూ జెడ్సీ వినతి పత్రాన్ని అందించినట్లు తెలిపారు. భూకబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోలేని యెడల వైకాపా ఆధ్వ ర్యంలో ధర్నాను చెపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నేతలు మార్డుపూడి పరదేశి, పల్లాచినతల్లి, షౌకత్‌ఆలీ, పల్లాపెంటారావు, అండిబోయిన అప్పారావు, వెంపాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# సబ్ ప్లాన్ నిధులతో చంద్రన్న పెళ్లి కానుకలా..?

## ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్న దళిత నేతలు


మాట్లాడుతున్న బిఎస్పి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నేతల నాగేశ్వరరావు

నర్సీపట్నం : సబ్ ప్లాన్ నిధులతో చంద్రన్న పెళ్లి కానుకలా అని దళిత సంఘాల నేతలు ఆగ్రహ ఆవేశాలు వ్యక్తం చేస్తున్నారు. దళితుల అభివృద్ధికీ, అభ్యున్నతికీ అనేక పోరాటాలు హైదరాబాద్ అరెస్టులు అయి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ సాధించుకున్నామని, అయితే నిధులతో చంద్రన్న పెళ్లి కానుకకు రూ.2.50లక్షలు 13 జిల్లాలకు కేటాయిస్తూ ప్రభుత్వం ఎంఇఎఒ నెంబరు జి1/836/2017 విడుదల చేయడం దారుణమని బిఎస్పి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నేతల నాగేశ్వరరావు ఆరోపించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ దీని వల్ల సాంఘిక సంక్షేమశాఖ ద్వారా కులాంతర వివాహాల ప్రోత్సాహానికిచ్చే నగదు నిలిచిందన్నారు. సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ నుంచి సబ్‌ప్లాన్ నిధులను మళ్లించి ప్రభుత్వం చంద్రన్న పెళ్లి కానుక పేరుతో కనీసం ఎస్సీ, ఎస్టీ సంఘాల పెద్దలను గానీ, గ్రామ పెద్దలను గానీ ప్రాధాన్యత లేకుండా పార్టీ నాయకులే పని కట్టుకొని ఇవ్వడం ఎంత వరకూ సబబో వారి విజ్ఞతకే విడిచిపెడుతున్నామన్నారు. జిల్లాలో ఇంకా 35 మంది కులాంతర వివాహాలు చేసుకున్న వారికి నేటికి పంపిణీ జరగలేదన్నారు. కేంద్ర నిధులను దళితుల అభ్యున్నతికి కాక పార్టీ ప్రయోజనాలకే మళ్లించిన ముఖ్యమంత్రి తెలుగుతేజం పేరుతో ఏమి సాధించారో దళిత జాతికి తెలియజేయాలని కోరారు. చంద్రన్న పెళ్లి కానుక వల్ల కులాంతర వివాహాలు ఇంకా జరగవేయో అనే భయం అటు గ్రామాల్లోనూ, ఇటు ప్రేమికులలోనూ నెలకొందన్నారు. ఇకనైనా సాంఘిక సంక్షేమశాఖ ద్వారానే ఈ కానుకనపు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి మహిళా కన్వీనర్ నేతల నూకరత్నం, డిహెచ్‌పిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.అప్పలరాజు, నాయకులు బండి కన్నబాబు, యాదగిరి దాసు, మర్రా చిన్ని, గుడాల ముఠా, బెల్లాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## అపరాల సాగుపై రైతులు దృష్టి

రావికమతం : ఈ ఏడాది వేసవిలో కురిసిన అకాల వర్షాలతో వాతావరణం అనుకూలించి రైతులు అపరాల సాగుపై దృష్టి సారించారు. ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాలు అపరాల సాగుకు మేలు చేకూర్చాయని చెప్పాలి. ఇప్పటికే వేరుశెనగ, నువ్వు, చోడి, మినుము, ఉలవ, కంది, మిరప తదితర అపరాల పంటల ఫలసాయం రైతులు చేతికొచ్చింది. ప్రస్తుతం పిల్లి పెసర కోత దశలో ఉన్నాయి. పిల్లి పెసర పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడుతుంది. రబీలో అపరాల సాగు సాధారణ విస్తీర్ణం 320 హెక్టారు. ఈ ఏడాది 275 హెక్టార్లలో సాగు చేశారు. నువ్వు 60 హెక్టార్లు, వేరుశెనగ 60, మినుము 75, పెసరు 160, బబ్బర 85 హెక్టార్లలో సాగు చేశారు. ఖరీఫ్‌లో వరి సాగునకు రైతులు ఇప్పటికే వరి ఆకు పోతలు పోశారు. పిల్లి పెసర కాయలు తీసుకొని, చెట్లను దమ్ములో కలియదున్ని పచ్చి రొట్ట ఎరువుగా ఉపయోగిస్తామని రైతులు తెలిపారు. అపరాల సాగు, పంట కాపు బాగానే ఉందని, దిగుబడి కూడా ఆశాజనకంగానే ఉందని దాసరయ్యపాలెం, మట్టవాని పాలెం, మేడివాడ, టి.అర్జాపురం, గర్నికం, చినపాచిల, రావికమతం గ్రామాలకు చెందిన పలువురు రైతులు తెలిపారు.

## భీమిలీ బీచ్‌లో చెత్తలు తొలగింపు



భీమునిపట్నం : భీమిలి జోన్ పరధిలో వున్న భీమిలి బీచ్ లో జోనల్ కమీషనర్ పి.దుర్గాప్రసాద్ ఆద్వర్యంలో మేజిక్ బస్సు స్వచ్ఛంద సభ్యుల ద్వారా మరియు భీమిలి జోన్ పారిశుధ్య సభ్యులు బీచ్ లో వున్న చేత్తలను తొలగించారు. ఈ కార్యక్రమంలో మేజిక్ బస్సు సిబ్బంది శానిటరీ ఇన్స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన సంఘం ఆధ్వర్యంలో

## ఖాళీ బిందెలతో భారీ ర్యాలీ




అనంతగిరి : అనంతగిరి మండల కేంద్రంలో సోమవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో బాగ్మరవలస సిసాగుడ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ కాళి బిందెలతో భారీ ర్యాలీ నిర్వహించారు ఈకార్యక్రమంలో డి గంగరాజు ఎంపిటిసి సభ్యులు మాట్లాడుతూ వెంటనే మంచినీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు పీ్ఓ స్పందించి వెంటనే 2 లక్షల రూపాయలు మంజూరు చేశారు ఈకార్యక్రమంలో మొసియ దేవన్నా అప్పలరాజు నాగులు కె స్వామి పి స్వామి తదితరులు పాల్గొన్నారు.

### ఆరవ రోజుకు చేరిన

## ఎస్ఆర్‌బి కప్ క్రికెట్ టోర్నీ



అనకాపల్లి : ఎన్టీఆర్ స్టేడియంలో ఎస్ఆర్‌బి ఇండస్ట్రీ చైర్మన్ కొణతాల సీతారాం ఆధ్వర్యంలో ఎస్ఆర్‌బి క్రికెట్ టోర్నీ సోమవారం నాటికి ఆరవ రోజుకు చేరుకుంది. సోమవారం జరిగిన ఎస్ఆర్‌బి క్రికెట్ టోర్నమెంట్‌లో అనకాపల్లికి చెందిన కోరిబిల్లి పరి టీమ్, తిమ్మరాజుపేట క్రికెట్‌టీముకు మద్య పోటీ జరిగింది. ఈ పోటీలో 15 పరుగులు తేడాతో కోరిబిల్లి పరి టీమ్ విజయం సాదించింది. మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా కనకాల అరవింద్ కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ గ్రౌండ్ క్రికెట్ సభ్యులు ఆర్గనైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

## 8వ తేదీన తాండవ నీరు విడుదల

నాతవరం : ఈ నెల 8వ తేదీన తాండవ జలాశయ నీటిని విడుదల చేస్తున్నామనిజలాశయ చైర్మన్ పారుపల్లి కొండబాబు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రైతుల నారుమడులు ఎండిపోతాయని తెలపడంతో రైతుల విజ్ఞప్తి మేరకు ముందుగా నీటిని విడుదల చేయాలని నిర్ణయించామన్నారు. దీనికి మంత్రి అయ్యన్నపాత్రుడు ఆమోదం తెలపడంతో రైతులకు నష్టం లేకుండా నీటిని అందిస్తామన్నారు. ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు నీటిని విడుదల చేస్తామన్నారు.

### కేజీబీ పాఠశాలలో

## డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలపై అవగాహనా సదస్సు

భీమునిపట్నం : భీమిలీలో క్రిష్ణాకోలని లో ఉన్న కె.జీ.బి. పాఠశాల లో డెంగ్యూ, మలేరియా,విషజ్వరాలు పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భీమిలి ప్రభుత్వ ఆసుపత్రి ప్రదాన వైద్య అధికారి దిద్దె .సిదార్ధ్ కుమార్ విద్యార్ధినిలతో మాట్లాడుతూ నీటి నిల్వలు వుండడం, పరిసరాలు పరిసుభ్రం గా లేకపోవడం వల్ల డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని, అవి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. అంతే కాకుండా దోమలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కాగా అక్కడ కాలువలు శుభ్రంగా ఉన్నాయా లేవా అని పరిశీలించారు. అక్కడ వున్న సిబ్బందికి విద్యార్దినిలకు అవగాహనా కలిప్పించారు. పరిసరాలు అన్ని పరి శుభ్రంగా వుంచుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో కె,జి బి. పాటశాల అధికారిని కె.గ్రేస్ లిల్లీ, సిబ్బంది ఆశా వర్కర్ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ హామీలు నెరవేర్చాలని బిజెపి నిరసన

కొయ్యూరుః తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద బిజెపి నేతృత్వంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బిజెపి మండలాధ్యక్షులు కె.సుబ్రహ్మణ్యం, మండల ఉపాధ్యక్షులు మరుకుర్తి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కూడా నూకరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో నేతలు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం పూజారులకు, పాస్టర్‌లకు గౌరవ వేతనం 5వేలు ఇస్తామని నాలుగున్నర ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. అలాగే గత కొద్ది కాలంగా సాధికార మిత్రలను టిడిపి ప్రభుత్వం వాడుకుంటూ వారికి ఏ విధమైన గౌరవ వేతనం ఇవ్వనందున వారికి కరూడా రూ.5వేలు గౌరవ వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వారు తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చ అధ్యక్షులు హరిమెలరాజు, మరుకుర్తి సతీష్, కొనకం లక్ష్మణరావు, నడిగెట్ల నూకరాజు, రవి, యల్లంకి నారాయణమూర్తి పాల్గొన్నారు.

## మీకోసం అర్జీలు సత్వర పరిష్కారం

నర్సీపట్నం : మీకోసం కార్యక్రమం లో దాఖలైన అర్జీలపై సత్వర పరిష్కారం చేయాలని నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి వి.విశ్వేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. నర్సీపట్నం గచ్చపు వీధికి చెందిన మార్తి శ్రీరామమూర్తి తాను మాజీ సైనికోద్యోగినని గతంలో తనకు కోటవురట్ల మండలం బోడపాలెం గ్రామంలో ఎ.1-14 సెం. భూమిని ప్రభుత్వం కేటాయించిందని పేర్కొంటూ ప్రస్తుతం తన కుమార్తె వివాహ నిమిత్తం సదరు భూమిని విక్రయం చేసేందుకు అనుమతించాల్సిందిగా దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై విచారణ చేసి రిపోర్టు సమర్పించవలసిందిగా ఆర్డిఓ కోటవురట్ల తహశీల్దార్ ఆదేశించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

### ముగ్గురికి తీవ్ర గాయాలు



అనకాపల్లి : ఆటోను ఆర్టీసి సూపర్ లగ్జరీ బస్సు పిసినికాడ జాతీయ రహదారి గ్రామీణ బ్యాంకు వద్ద ఢీకున్న సంఘటనలో సోమవారం తెల్లవారుజామున ఇద్దరు మృతి చెందగా , ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం కశింకోట నుండి అనకాపల్లి మార్కెట్‌కు వెళ్తున్న ఆటోని ఎలమంచిలి వైపు నుండి విశాఖ వైపు వెళ్తున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న కశింకోట మండలం సింగవరం గ్రామానికి చెందిన ఇంటిగ్రేడ్ గర్ల్స్ హాస్టల్‌లో పనిచేస్తున్న జామి లక్ష్మి (45) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు అనకాపల్లి వేల్పుల వీధికి చెందిన గొర్లి లక్ష్మీ నారాయణ (23) , కశింకోట బజారు వీధి ఎస్సీకాలనీ చెందిన శిరీషా (20) , మాదేటి సత్యనారాయణ(45) లకు తలలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరినిఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్సకు తరలించారు. ఈశ్వరరావు , లక్ష్మి మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి డిఎస్పీ కేవీ రమణ, ట్రాఫిక్ సీఐ కిరణ్‌కుమార్ చేరుకొని పరిశీలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రులను జనసేన నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారం, టీడీపీ నాయకులు ముత్తంశెట్టి మహేష్, ప్రముఖ వైద్యులు డాక్టర్ సత్యవతి, విష్ణుమూర్తి, దాడి రత్నాకర్ మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. మృతుని కుటుంబీకులకు జనసేన నాయకులు సీతారం ఆర్థిక సహాయం అందజేశారు.

## కొండకర్ల ఆదర్శ పాఠశాలకు మైక్రోఫోన్ వితరణ




అచ్యుతాపురం: చదువుకోవడం వలనే పేదరికాన్ని నిర్మూలించవచ్చునని వైద్యులు జి.గురు నాధరావు అన్నారు.

సోమవారం ఆయన తన కుమారుడు గంజి మోహన్ వంశీ జ్ఞాపకార్థం కొండ కర్ల ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు మల్టీమీడియా స్పీకర్ సిస్టమ్ విత్ కార్డులెస్ మైక్రోఫోన్‌ను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని విహెచ్. నళిని, ఉపాధ్యాయులు టి.ఎ.సత్య నారాయణ, మారిశెట్టి వెంకట అప్పారావు, కె.సోమశేఖర్, ఎ.విజయ్ తదితరులు ఉన్నారు.

## సాయిమందిరం రహదారి అధ్వానం

యలమంచిలి రూరల్ : పట్టణంలో కోర్టుపేట కాలనీలనో సాయి మందిరం ఉన్న రహదారి చెత్తాచెదారం పేరుకుపోయి దర్శన మిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. పారిశుద్య శాఖ అధికారులు ఈ రహదారిని పూర్తిస్థాయిలో పట్టించుకోకపోవడంతో రహదారిపై చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో ఈ రహదారిపై చెత్తా చెదారం పేరుకుపోయింది.

ఇప్పటికైనా పారిశుద్య నివారణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## చంద్రన్నబీమా పరిహారం పంపిణీ



భీమునిపట్నం : భీమిలి జోన్ 15వవార్డు గాడువీదిలో మృతి చెందిన డొకర నారాయణరావు నామిని అయిన తండ్రి సూర్య నారాయణ కు చంద్రన్నభీమా తక్షణ సహాయం క్రింద ఐదువేలు భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటా నూకరాజు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రన్నభీమా ప్రతీ ఒక్కరూ కట్టాలని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాడు.సన్యాసినాయుడు, డొకర. సన్యాసప్పడు, కాసరపు.నాగరాజు, గాడు.ఆనంద్, చురకల.రమణ, దాసరి వెంకటేష్, అప్పికొండ.రాజు, భీమామిత్ర పోతిన.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### యన్ఆర్ఈజియస్ ఆధ్వర్యంలో

## గునపములు పంపిణీ



అనంతగిరి : మండలకేంద్రం ఎమ్పీడీఓ కార్యాలయంలో సోమవారం యన ఆర్ ఈ జియస్ ఆద్వర్యంలో అనంతగిరి ఎమ్పీపి గుజ్జెలపైడితల్లి చేతులు మీదుగా గునపములు పంపిణీ జరిగినది ఈసంధర్భంగా పైడితల్లి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజలకొరకు చాలా మంచికార్యక్రమాలు ప్రవేశపెడుతుందని దానిని మనం సద్వినియోగం చేసుకోవాలని ఆమెఅన్నారు ఈకార్యక్రమము లో జిల్లా పరిషత్ ఉపాద్యక్షుడు కొట్యాడ అప్పారావు ఎమ్పీడీఓ రమేష్ రామన్ .ఎన్ ఆర్ ఈ జియస్ ఏపీఓ జగదీష్ .ఈ.సి. పవన్ వివిధ గ్రామాల నుంచివచ్చిన వీఆర్పీలు ప్రజలు పాల్గొన్నారు.

## హిందీ పరీక్షల సర్టిఫికేట్లు పంపిణీ



భీమునిపట్నం : దక్షణ భారతదేశ ప్రచార సభ వందేళ్ళు పూర్తి అయిన సందర్భంగా భీమిలి లో అదర్స్ ప్రమీ మండలి అద్యక్షులు కె.ఎస్.ఆర్ .కృష్ణారావు ఆద్వర్యంలో సుమారు 60 మంది విద్యార్దులకు పుస్తకాలు, హిందీ పరీక్షల సర్టిఫికేట్లు భీమిలి డివిజన్ అద్యక్షులు గంటా నూకరాజు అందజేసారు.నూకరాజు మాట్లాడుతూ దేశ బాష అయిన హిందీ పట్ల వివక్ష చూపకుండా అందరూ నేర్చుకోవాలని కోరారు.ఈ కార్యక్రమం లో కాసరపు నాగరాజు, గిడుతూరి శ్రీనివాసరావు,కొక్కిరి అప్పన్న,సిదార్ధ వర్మ,రమణ, పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదు

గొలుగొండ : ప్రజా ప్రతినిధులు తమ ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదని నర్సీపట్నం ఐసిడిఎస్ సిడిపిఒ ఎం.శ్రీకళ అన్నారు.

EDUCATION
PASS IN SHORT PERIOD
(for Discontinued A.U)
B.A / B.Com / B.Sc / M.A / M.Com / M.Sc / Diploma / B.Tech/10th /Inter One Sitting
9848721118, 9848731118

# అన్నపూర్ణాలయాన్ని సందర్శించిన మంత్రి మల్లాడి



యానాం: మధ్యాహ్న బోజన పథకంలో విద్యార్థులకు ఆహార పదార్థాలను తయారు కేంద్రం అన్నపూర్ణాలయాన్ని పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు పరిశీలించారు. సోమవారం ఉదయం కె.ఎన్.జి.జి. స్కూల్ ఆవరణలో ఉన్న అన్నపూర్ణాలయంలో విద్యార్థులకు ఆహారపదార్థాలను తయారుచేసి ఆయా ప్రాంతాలలోని పాఠశాలలకు రవాణా చేస్తున్న వ్యవహారాలపై అధికారులను, సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. ఆహార పదార్థాల రుచులను స్వయంగా తిని పరిశీలించారు. సిబ్బంది పనితీరుపైన ఆరా తీసారు. సరిగా పనిచేయని వారిపై అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సిబ్బంది పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తొలుత ఎన్‌జిజి బాలుర హైస్కూల్‌లో డిజటల్ తరగతుల కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులకు హెడ్‌ఫోన్‌లు పంపిణీచేశారు. స్కూల్ ఆవరణలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడం లేదంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పరిసరాల పరిశుభ్రతకు ఏరోజుకు ఆరోజు సిబ్బంది పని చేయించేలా సత్వరం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జూనియర్ కళాశాలలోన టాయిలెట్ బ్లాక్‌లను పరిశీలించి విద్యార్థులకు అనువుగా వుండేలా టాయిలెట్‌లను ఏరోజుకారోజు సుభ్రపరచాలని పక్కస్థలంలో నూతన టాయిలెట్ నిర్మాణ పనులుచేపట్టాలని వారంలో ఒకరోజు పరిశుభ్రత కార్యక్రమంల చేపట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రిన్సిపాల్‌కు, లెక్చరర్లుకు సూచించారు.

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి కాలే సాయినాథ్, సర్వశిక్షాభియాన్ కోఆర్డినేటర్ కమిడి ప్రభాకర్, జెఇ పి. భాస్కర్, పి. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత కాకినాడగా తీర్చిదిద్దుదాం: అలై. డా.చప్పిడి

### రైతుబజారులో అవగాహన....చేతిసంచుల పంపిణీ




కాకినాడ : కాకినాడ నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ అలై డా. చప్పిడి వేంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. అలయన్స్ క్లబ్ కాకినాడ శరవణ్ అధ్యక్షులు అలై ప్రయాగ సత్యన్నారాయణ మూర్తి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వాడకం నిషేధించండి, పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోండి అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేసారు. ఈ సందర్భంగా డా. చప్పిడి మాట్లాడుతూ ప్లాస్టిక్ వలన పర్యావరణంతో పాటు మానవు ఆరోగ్యాలు నాశనమవుతాయని పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. రీజియన్ ఛైర్మన్ అలై వనం శ్రీనివాసరావు మాట్లాడుతూ కాకినాడను ప్లాస్టిక్ రహిత నగరంగా తయారు చేయుటకు కృషి చేస్తానన్నారు. అలాగే ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిభిరాలు నిర్వహణకు తనవంతు సహాయ సహకారాలు అందించడం జరగుతుందన్నారు. అలై దిలీప్ కుమార్ సదనాని మాట్లాడుతూ సమాజహితం కోసం మొక్కలు నాటడం, రక్తదాన శిభిరాలు నిర్వహించాలని కోరారు. అనంతరం రైతు బజారుల్లో ప్లాస్టిక్ సంచులు మానండి ఆరోగ్యంగా ఉండండి అనే నినాదాలతో రైతు బజారు వినియోగదారులను చైతన్య పరుస్తూ చేతి సంచులను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రవి, కోశాధికారి భాస్కర్, వివిఎస్.ప్రసాద్, డా.రామ్ మోహనరావు, చందన మోహనరావు, అలై శేతుమాధవరావు, బాలు, కృష్ణగోపాల్‌లునాని, రెడ్డి, సుబ్బారెడ్డి అధికసంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి సంతాపం

యానాం: అనారోగ్యంతో మృతిచెందిన మృతుడు కమిడి చెంచయ్య (80) కుటుంబాన్ని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. సోమవారం ఉదయం స్థానిక ఓల్డ్‌రాజీవ్ నగర్‌లోని ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. మృతికి కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ గిడ్ల చంద్రరావు, మడికి వెంకటేశ్వర్లు, కెవివి సత్యనారాయణ, ఎం. బుజ్జి, ఆయా గ్రామాల పెద్దలు తదితరుల పాల్గొన్నారు.

## దివ్యాంగుల సేవలే సంతృప్తికరం

పెద్దాపురం: సమాజంలో అన్ని సేవలు కంటే దివ్యాంగులకు చేసిన సేవలే మనకు సంతృప్తినిస్తాయని ఫ్రెండ్ ఫర్ ఎవర్ యూత్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. పెద్దాపురం మండలం పులిమేరలో గల శాంతివర్ధనం దివ్యాంగుల పాఠశాలలో స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ట్రిఫిక్ ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను చేసేందుకు ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ అసోసియేషన్ ప్రారంభించబడినదని దాని ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుచున్నదని అన్నారు. దివ్యాంగుకు భోజనాలు, దోమతెరలు, నిత్యావసరాలు అందించడం జరుగుచున్నదని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని సభ్యులు కోరారు. ఈ సమావేశంలో నిర్వాహకులు వీరబాబు, సత్యవతి, శివ, లోవరాజు, శ్రీను, నారాయణ అనిల్, అర్జున్ పాల్గొన్నారు.

## రైతాంగ సమస్యల పరిష్కారానికై 9 న జైలుభరో

దేవరాపల్లి : రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, బిజెపి ప్రభుత్వము ఎన్నికల హమీలు అమలచేయాలని డిమండ్ చేస్తు ఆగస్టు 9 న అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయం వద్ద జరుగు జైలుభరో జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంగం జిల్లా కార్యదర్శి డి .వెంకన్న, గిరిజన సంగం నాయకులు సి హెచ్ .రాజు, కేవీపీస్ జిల్లా నాయకులు కాటపల్లి అప్పారావు కొరారు. స్థానిక కూరగాయల మార్కెట్లో రైతులతో ప్రజా సంఘాల నాయకులు అధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రైతాంగాన్ని రక్షించాలని, మద్దత ధరలు, రుణవిముక్తి చట్టబద్దతకై 10 కోట్ల రైతుల సంతకాలతో ప్రధానమంత్రికి నిరసన తెలుపుతు జైలుభరో కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వేలాదిగా రైతులు పాల్గో వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కర్రి సన్యాసి నాయుడు, జానా సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాపురంలో పొటెత్తిన భక్తులు

పెద్దాపురం: రాష్ట్రస్థాయిలో ప్రఖ్యాతి చెందిన మరిడమ్మ అమ్మవారి ఉత్సవాలకు ఆదివారం అమ్మవారి ఆలయం భక్తులతో కిక్కిరిసిపో యింది. పరిసర ప్రాంతాల వాసులతోపాటు ఉత్తరాంధ్ర భక్తులు విశేషంగా రావడం, రాష్ట్రస్థాయి ప్రముఖులు రావడంతో అమ్మవార దర్శనం కష్టతరం అయింది. విఐపిల ప్రత్యేక దర్శనాలకు కూడా ఎక్కువ సమయం పట్టడంతో అదుపుచేయడం పోలీసులకు కష్ఠమైంది. వాహనాలను కిలోమీటరు మేర రోడ్డుమీద నిలిపారు. ద్విచక్రవాహనాలు ఎక్కడబడితే అక్కడే వదిలివేయడంతో రవాణాన్ని బైపాస్ రోడ్డుకి మరలించారు. దానివలన దర్శనానికి వచ్చిన భక్తులు గుడికి దూరంగా కిలోమీటరు నడుచుకుంటూ దర్శనాకి రావలసి వచ్చింది. గుడిలో కార్యకర్తలు భక్తులకు సహకరించారు. వృద్దులు, పిల్లలు, మహిళలకు మంచినీళ్ళు, మజ్జిగా ఏర్పాటుచేసారు. పోలీసులు భక్తులను దేవాలయంలోకి పంపడానికి శ్రమపడవలసి వచ్చింది.

వాతావరణం అనుకూలించడం, ఆషాడమాసం ముగియడంతో అమ్మవారిని దర్వనానికి భక్తులు పోటెత్తారని ఆలయ అధికారులు అంటున్నారు. అమ్మవారి దర్వనం సంతోషం కలిగించిందని, మనస్సుకి శాంతి కలిగించినదని భక్తులు ఆనందతో తెలిపారు.

## పురుగుల మందు సేవించి మహిళ మృతి

రావులపాలెం: పురుగుల మందు సేవించి మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధి దేవరపల్లి శివారు పుంత అరుందతి పేటలో జరిగినట్లు ఏఎస్సై బి. రామకృష్ణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధి దేవరపల్లి శివారు పుంత అరుందతి పేటకు చెందిన యార్లగడ్డ కుమారి (32) చిన్న చిన్న అప్పులు చేసి భర్తకు తెలిపిందని, భర్త మందలించడంతో పురుగుల మందు సేవించిందని, మెరుగైన వైద్యం నిమిత్తం రాజానగరం జిఎస్ఎల్ మెడికల్ కాలేజికి తరలించారని, చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు ఆయన తెలిపారు.

# బి.సి. స్కాలర్‌షిప్‌లు సకాలంలో చెల్లించాలని సిఎం చంద్రబాబుకి బిసి సంఘం వినతి



విశాఖపట్నం: బిసి స్కూలు, కాలేజి విద్యార్థుల స్కాలర్‌షిప్ మొత్తాలను సకాలంలో చెల్లించే విధంగా నిధులు విడుదలచేయాలని కోరుతూ, ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం రాష్ట్ర లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది కదిరిరాము ఎపి రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడికి వినతిపత్రం సోమవారం అందచేశారు. సిఎం నివాసంలోని క్యాంప్ ఆఫీసు ఆవరణలో చంద్రబాబుని కలిసి విద్యార్థుల పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సకాలంలో ఉపకారవేతనాలు అందనట్లయితే వెనుకబడిన విద్యార్థులు కెరీర్‌లో మరింత వెనుకబడే అవకాశం ఏర్పడుతుందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ సిఎంకి మహర్షి భగీరథుని చిత్రపటాన్ని బహుమతిగా అందచేశారు. సిఎంను కలిసిన వారిలో బిసి సంఘం అధికార ప్రతినిధి పెలన్ వి ఎస్ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడికామాచారి, మహిళా అధ్యక్షురాలు ఆల్తి వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు సేవలందించాలి: మంత్రి మల్లాడి

యానాం: ప్రభుత్వ ఆసుపత్రికి నిత్యం వచ్చే వివిధ రోగులకు వైద్యులు, నర్సులు, సిబ్బంది సరైన సేవలు అందించాలని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు సూచనలుచేశారు. సోమవారం ఉదయం ప్రభుత్వ ఆసుపత్రి ఏడి కార్యాలయంలో ఏడి కాశీ సత్యనారాయణ, గయనిక్ వైద్యురాలుతో ప్రత్యేక సమావేశంలో ఆయన మట్లాడారు. ఆసుపత్రిలో ప్రతిరోజు రోగులు 8.30 నుండి మధ్యాహ్నం 11.30 గంటల వరకు రోగులకు అందుబాటులో ఉంటూ వారికి సేవలు అందించాలన్నారు. సమయానికి రాకుండా ఆలస్యంగా రావడంవలన రోగులు ఇబ్బందికి గురవుతున్నారని ఇలా చేయడంవలన రోగులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారన్నారు.

యానాంను ఆనుకొని ఉన్న తాళ్ళరేవు, ముమ్మడివరంలో సదుపాయాలు అంతంత మాత్రమే ఉన్నప్పటికీ సేవలు బాగుంటున్నాయని ఇక్కడ అన్నీ ఉండీ సేవలు అందించడంలో వైద్యులు విఫలమవు తున్నారని దీనివలన యానాం ఆసుపత్రికి చెడ్డపేరు వస్తుందని అది రాకుండా జాగ్రత పడాలని సూచనలుచేశారు. ఉత్తమ సేవలు ఎవరు అందిస్తే ఆ పేరు వైద్యులకే దక్కుతుం దన్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు పుదుచ్చేరి ప్రభుత్వం జిప్‌మేర్ ఆసుపత్రి బ్రాంచి కార్యాలయం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.

## గ్రామీణ వైద్యుల సమస్యలపై జగన్మోహన్ రెడ్డితో చర్చించిన పదిలం



కత్తిపూడి/అన్నవరం: తూ.గో.జిల్లా కత్తిపూడి-శంఖవరం రోడ్డు మధ్య రాష్ట్ర ప్రతిపక్ష నేత, వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్.జగన్మోహన్ రెడ్డి బేసిక్ హెల్త్ కేర్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదిలం.బెన్నబాబు ఆద్వర్యంలో బిహెచ్ఎమ్ పిఏ సభ్యులు కలసి గ్రామీణ వైద్యుల సమస్యలపై జగన్మోహన్ రెడ్డికి వివరించగా అందుకు ఆయన సానుకూలముగా స్పందించి త్వరలో రానున్న వైయస్‌ఆర్ ప్రభుత్వంలో దివంగత నేత వైయస్. రాజశేఖరరెడ్డి ఇచ్చిన జీవో 429 ప్రకారం తిరిగి గ్రామీణ వైద్యులకు కమ్యూనిటీ పారామెడిక్స్‌గా ట్రైనింగ్ ఇచ్చి గుర్తిస్తామని తెలిపారు. అదేవిధంగా పల్లె, గ్రామీణ ప్రాంతాలలో గ్రామీణ వైద్యుల ఆవస్యకత ఉందని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వం గ్రామీణ వైద్యులకు ఇచ్చిన జీవో 465పై వత్తిడి తీసుకొస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఇందన.సత్తి వీర్రాజు, సెక్రటరీ వజ్రపు.వినోద్ కుమార్, జాయింట్ సెక్రటరీ యడ్ల.సత్య నారాయణ (వైయస్‌ఆర్) ఉపాధ్యక్షుడు కొత్తే.సతీష్, కోశాధికారి ఆంద్ర.ప్రసాద్, జిల్లా గౌ.అధ్యక్షుడు అందె.చిట్టికొండ, సత్యానందం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మానసిక వికలాంగుల పరిరక్షణకు కమిటీలు

- జిల్లా, మండల, గ్రామ స్థాయి కమిటీలతో పాటు మున్సిపల్, జోనల్ స్థాయిలో కడా ఏర్పాటుచేయాలి
- రోడ్లపై తిరిగే మానసిక వికలాంగులను గుర్తించి ఆశ్రమం కల్పించాలి, వైద్యసేవలు అందించాలి
- మానసిక వికలాంగులను వేదించే వారిని గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలి
- జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్



విశాఖపట్నం: రోడ్లపై తిరిగే మానసిక వికలాంగులను గుర్తించి, వారికి తగిన ఆశ్రయం, ఆహారం, వైద్య సేవలు కల్పించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా స్థాయి మానసిక వికలాంగుల గుర్తింపు కమిటీ చైర్మన్ ప్రవీణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి మానసిక వికలాంగుల గుర్తింపు కమిటీ తొలి సమావేశం కలక్టరేట్‌లో జరిగింది. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎస్. దామోదరరావు, అదనపు ఎస్‌పి రాజ్ కుమార్, జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పి. వెంకటేశ్వరరావే, లెబ్‌షెల్ఫే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సభ్యులుగా గల కమిలీ సమావేశమై మానసిక దివ్యాంగుర పరిరక్షణకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేయబడిన నియమనిబంధనల మేరకు సర్పంచ్‌లు చైర్మన్‌గా గ్రామ, ఎంపిడిఒలు చైర్మన్‌లుగా మండలస్థాయి కమిటీలు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. అయితే మున్సిపల్ జోనల్ స్థాయిలో కూడా ఈ కమిటీలను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. కమిటీ సమావేశాల నిర్వహించి మానసిక వికలాంగుల గుర్తింపు, వారి పరిరక్షణకు ప్రభుత్వం జారీచేసిన విధివిధానాలపై ముందుగా కమిటీ సభ్యుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కమటీ తీసుకుంటున్న చర్యలు మినిట్స్‌ను జిల్లాస్థాయి కమిటీకి అందచేయాలన్నారు. రోడ్లపైన తిరిగే వారే కాకుండా ఇళ్లలో వేధింపులకు గురవుతున్న మానసిక వికలాంగులను కూడా గుర్తించి వారి పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. వారిని వేధించేవారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా స్థాయి కమిటీలో మానసిక వికలాంగు ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కూడా సభ్యులుగా చేర్చాలన్నారు.

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎస్. దామోదరరావు మాట్లాడుతూ మానసి వికలాంగుల పరిరక్షణకు రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం జారీచేసి ఆదేశాలు, వాటి అమలుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం జారీచేసిన జిఒ ఎంఎస్ నెం 1, 13 మరియు 14 లలో పొందుపర్చిన నియమ, నిబంధనలు, కమిటీలు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

ఈ సమావేశంలో విశాఖ రూరల్ డిఎస్‌పి పాపారావు, జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వరరెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



భీమునిపట్నం భీమిలి డివిజన్ టిడిపి ప్రధాన కార్యదర్శి గొలగాని నరేంద్రకుమార్ పుట్టినరోజు వేడుకలు మంత్రి గంటా క్యాంపు కార్యాలయంలో డివిజన్ ప్రెసిడెంట్ గంటా నూకరాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి ఇందులో పార్టీ ఉపాధ్యక్షులు యోగి, అధికార ప్రతినిధి సంజీవ్ , ఆర్గనైజింగ్ సెక్రటరీ గిడుతూరి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ చురకల రమణ, నాయకులు దాసరి వెంకటేష్ కె అప్పన్న, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల జిల్లా కేంద్ర ఆసుపత్రిలో రిమ్స్ లో ఇంజక్షన్ వికటించిన సంఘటన లో అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులు కు పరామర్శించి ,కుటుంబ సభ్యులతో ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని, అనంతరం వైద్యులుతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు, ఈ సంఘటన లో మృతి చెందిన వారి కుటుంబాలకు 20 లక్షల రూపాయలు చొప్పున్న,అనారోగ్యంతో బాధపడుతున్న వారికి లక్ష రూపాయలు చొప్పున్న ఎక్సగ్రేషియా చెల్లించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ మీడియా సమావేశంలో మాట్లాడుతున్నా కేంద్ర మాజీ మంత్రి డా.కృపారాణి, డా.రామ్మోహనరావు, డోల. జగన్,చౌదరి. సతీష్, పి.విశ్వప్రసాద్,మురళి,దిన్.కె ప్రసాద్,బి.రాము పలువురు నేతలు పాల్గొన్నారు.

# హోలీటెక్ కంపెనీతో ఏపీ సర్కార్ ఒప్పందం

అమరావతి : నవ్యాంధ్రకు పెట్టుబడులు క్యూ కడుతున్నాయి. తాజాగా ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తి సంస్థ హోలీటెక్ ఏపీ సర్కార్‌తో కీలకమైన ఎంవోయూ చేసుకుంది. అమరావతిలో మంత్రి లోకేష్ సమక్షంలో కంపెనీ ప్రతినిధులు ఒప్పందాలను కుదుర్చుకున్నారు. హోలీటెక్ కంపెనీ భారతదేశంలోనే మొదటిగా ఏపీలో రూ.1400కోట్ల పెట్టుబడి పెడుతోంది. తిరుపతి సమీపంలో 75 ఎకరాల్లో ఏర్పాటు చేయ్యున్న ఈ హోలీటెక్ ప్లాంట్‌లో.. ప్రతినెలా 5కోట్ల మొబైల్ విడిభాగాల్ను ఉత్పత్తి చేయనున్నారు. ఈ కంపెనీ ద్వారా 6వేల మందికి ఉద్యోగ అవ్కాశాలు రానున్నాయి.



హోలీటెక్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు మంత్రి నారా లోకేష్. ఈ కంపెనీకి చైనాలో 16 ఫ్యాక్టరీలు ఉన్నాయని.. దేశంలోనే మొదటిసారిగా ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. హోలీటెక్ మొత్తం ఐదు ప్రొడక్ట్‌లు .. టిన్ ఫిలిమ్ ట్రాన్సిస్టర్, లెక్సిబుల్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు, కేపాసిటర్ టచ్ స్క్రీన్, సీసీఎం (కాంపొనెట్ కేమ్రామోడ్యూల్), ఫింగర్ ప్రింట్ మాడ్యూల్‌ను ఇక్కడే తయారు చేయనున్నారని చెప్పారు. ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందన్నారు హోలీటెక్ ప్రతినిధి మనజియన్. చంద్రబాబు విజన్ ఉన్న సీఎం అని.. అందుకే ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు నిర్ణయించామన్నారు. ఇక్కడే హోలీటెక్ అతిపెద్ద ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతోందని చెప్పారు.

# గుల్లలపాలెం జీవీయంసీ ఆసుపత్రిలో "ఈ" వైద్యసేవలను విరమించుకోవాలి

సింధియా: పారిశ్రామి కప్రాంతం జీవీయంసీ 47వ వార్డులోని ప్రభుత్వ ఆసుపత్రిలో " ఈ" వైద్యసేవలను ప్రవేశ పెట్టవద్దని, అటువంటి ఆలోచనలను తక్షణమే విరమించుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ విశాఖ పశ్చిమ నియోజకవర్గం అధ్యక్షులు పెదిరెడ్ల నానాజీ డిమాండ్ చేసారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుగా ఉండేవని, రోజు సుమారు 300 మంది రోగులు వైద్యసేవలను వినియోగించుకుండే వారని అయితే రెడ్‌క్రాస్ సంస్థకు అప్పజెప్పినప్పటినుంచి వైద్యసేవలు రోగులకు సరిగ్గా అందడం లేదని, దీంతో రోగులు నానా అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. అంతే కాకుండా పనిచేసే సిబ్బందికి 3నెలల నుంచి జీతం అందించడం లేదని, సకాలంలో జీతం చెల్లించకపోవడం దారుణమని మండిపడ్డారు. ఇవన్నీ సరిచేయకుండా రోగులకు "ఈ" వైద్యసేవలను ప్రవేశపెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనివలన రోగులు మరింత



ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోనవలసి వస్తుందని వాపోయారు. తక్షణమే వైద్యసేవలను మెరుగు పర్చాలని, వైద్యసిబ్బందికి జీతాలను సకాలంలో ఇవ్వాలని, 'ఈ' వైద్యసేవలను విరమించుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని అందివ్వడం జరిగిందని తెలిపారు. వినతి పత్రం అందించినవారిలో బిఎస్పీ నాయకులు తదితరులు ఉన్నారు.

# సెల్ టవర్ ఎక్కిన మహిళ



విశాఖపట్నం : విశాఖ కలెక్టరేట్ వద్ద ఓ మహిళ సెల్ టవర్ ఎక్కడం స్థానికంగా కలకలం రేపింది. తనకు న్యాయం చేయాలంటూ లక్ష్మి అనే మహిళ కలెక్టర్ వద్ద ఉన్న సెల్ టవర్ ఎక్కింది. అధికారులు, పోలీసులను ఉరుకులూ పరుగులు పెట్టించింది. మల్కాపురం ప్రాంతానికి చెందిన లక్ష్మి భర్త కొన్నేళ్ల కిందట మరణించాడు. నాటి నుంచి ఇద్దరు కూతుళ్లను తానే పెంచి పోషిస్తోంది. తనకు చెందిన స్థలాన్ని ఓ రిటైర్డ్ పోలీస్ కానిస్టేబుల్ ఆక్రమించారని ఆమె ఆరోపిస్తోంది. అతడిపై చర్యలు తీసుకొమ్మంటూ అధికారులకు ఫిర్యాదు చేయగా.. ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ఆరోపిస్తోంది.

తనకు పిల్లల పోషణ భారమైందని, ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం లభించడంలేదని లక్ష్మి ఆరోపిస్తోంది. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగానని, అయినా తనకు న్యాయం జరగడంలేదని ఆమె చెబుతోంది. చివరికి కలెక్టరేట్‌ను ఆశ్రయిస్తే.. కలెక్టర్‌ను కలవనీయకుండా అధికారులు అడ్డుపడుతున్నారని ఆరోపిస్తోంది. దీంతో మనస్తాపానికి గురై సెల్ టవర్ ఎక్కినట్లు తెలిపింది. తనకు న్యాయం చేయకపోతే అక్కడ నుంచి దూకేస్తానని బెదిరించింది. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి వచ్చి లక్ష్మికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పోలీసులు ఆమెను సురక్షితంగా కిందకి తీసుకొచ్చారు.

అనంతరం కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. ప్రభుత్వ పరంగా సాయం చేస్తామని, భూ ఆక్రమణ విషయమై దర్యాప్తు చేయిస్తామని కలెక్టర్ ఆమెకు హామీ ఇచ్చారు.

## నిరుద్యోగుల పాలిట వరం

# ముఖ్యమంత్రి 'యువనేస్తం'



విశాఖపట్నం: నిరుద్యోగులనూ ఆదుకునే లక్ష్యంతో రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన 'యువనేస్తం' పథకం వరమని పర్యావరణ ప్రేమికులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, స్వాతి ప్రమోటర్స్ ఛైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం 32వవార్డు పరిధిలోని అక్కయ్యపాలెం జాతీయ రహదారి సమీపంలో నిర్వహించిన యువనేస్తం కార్యక్రమం ప్రకటించిన చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు తెలియజేస్తూ స్వాతి కృష్ణారెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా గత నాలుగున్నర ఏళ్ళుగా చంద్రబాబునాయుడు ప్రజలకందిస్తున్న ప్రజా ప్రయోజన పథకాల్లో భాగమే నిరుద్యోగులకు ప్రకటించిన 'యువనేస్తం పథకం' అని ఆయన భావించారు. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలను లోటుబడ్జెట్‌లోనూ అమలు చేస్తున్న చంద్రబాబునాయుడు పాలనాదక్షత ప్రజల హృదయాల్లో నిలిచిందన్నారు. నిన్నటి అన్న కేంటీన్‌లతో సామన్యాలకు నేటి యువనేస్తం-నిరుద్యోగ పథకంతో యువతరమూ చంద్రబాబుకు పెట్టని కోటగా మారారని చెప్పారు. 32వవార్డు పార్టీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు అన్నంరెడ్డి వాణి, 14వవార్డు అధ్యక్షులు మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి గండి దేవుడమ్మ, ఇతర నాయకులు ఎన్.అప్పారావు, వై.కిరాజు, గువ్వల విజయకుమారి, గంట్యాడ ఆదినారాయణ, 13వవార్డు వరలక్ష్మి, ఇతర కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# ఆగష్ట్ 7న జరిగే నిరుద్యోగ వంచన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

విశాఖపట్నం : 2014 ఎన్నికలకు ముందు ప్రతి ఇంటికో ఉద్యోగం లేదా రెండు వేల రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తామని యువతను నమ్మించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు యువతను మోసం చేశారని ఆంధ్రాయూనివర్శిటీ జ్యోతీరావుపూలే విగ్రహం దగ్గర జరిగిన వై.యస్.ఆర్. స్టూడెంట్ యూనియన్ సమావేశంలో నిర్ణయించారు. అనంతరం వై.యస్.ఆర్. స్టూడెంట్ యూనియన్ విశాఖపార్లమెంటు అధ్యక్షులు బి.కాంతారావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నిరుద్యోగులను మోసం చేశారని, వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్‌మోహన్ రెడ్డిగారి పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా "నిరుద్యోగ వంచన" కార్యక్రమాన్ని ఆగష్ట్ 7న విశాఖపట్నంలో జరిగే "నిరుద్యోగ వంచన" కార్యక్రమానికి ఆంధ్రాయూనివర్శిటీ మరియు నగరంలోని విద్యార్థులు, యువత భారీఎత్తున హాజరవుతున్నట్లు తెలిపారు. చంద్రబాబు నాయుడు నాలుగేళ్ళు తరువాత మళ్ళీ ఎన్నికలు వస్తున్న తరుణంలో రూ॥1000/-లు నిరుద్యోగ భృతి, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 2.12లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే కేవలం 20వేల ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ ప్రకటించడం దారుణమన్నారు. టి.డి.పి. అధికారులు వచ్చాక కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను దాదాపు 80వేల మందిని తొలగించారు. ఉద్యోగాల నోటిఫికేషన్‌లో నిరుద్యోగులను మోసం చేసి ద్రోహం తలపెట్టిన ప్రభుత్వం, ఉన్న ఉద్యోగులను తొలగించి ఆయా కుటుంబాలను సైతం వీధుపాలు చేసినారు. చంద్రబాబునాయుడు 50 నెలలకి రూ॥1లక్ష బాకీ ఉన్నారు. అది



తీర్చకుండా ఎన్నికలు దగ్గర పడుతున్నప్పుడు ఎన్నికల భృతిగా ఒక పదివేలు వేసి మోసం చేయాలని ప్రయత్నిస్తున్నారు. నిరుద్యోగభృతి కేవలం 12లక్షల మందికి కాకుండా కోటిమందికి భృతి ఇవ్వాలి. రూ॥2000/-లు భృతి ఇస్తామని కేవలం ప్రస్తుతం రూ॥1000/-లు ఇవ్వడం దారుణమన్నారు. చంద్రబాబు మోసాలను నిరుద్యోగులు గ్రహించారని ఎన్నికలు వస్తే ఓటు అనే ఆయుధంతో ఓడిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్. విశాఖ పార్లమెంటు అధ్యక్షులు బి.కాంతారావు, వై.యస్.ఆర్.యస్.యు. అరకు పార్లమెంటు అధ్యక్షులు టి.సురేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శులు బి.మోహన్, ఎమ్.సురేష్, కళ్యాణ్, విద్యార్థి నాయకులు, జగదీష్, జీవన్, సాయికిరణ్, హథిరామ్‌నాయక్, శ్యామ్, శ్రీను, లీలాకృష్ణ మరియు అధిక సంఖ్యలో విద్యార్థులో పాల్గొన్నారు.

# చంద్రబాబును కలిసిన మంత్రి కళా

అమరావతి: సీఎం చంద్రబాబును మంత్రి కళా వెంకట్రావు కలిశారు. శ్రీకాకుళంలో ఇంజక్షన్ వికటించి ముగ్గురు మృతిచెందిన ఘటనపై చంద్రబాబుకు కళా వివరాలు తెలిపారు. విశాఖ కేజీహెచ్‌లో ఐదుగురు, రిమ్స్‌లో 12మందికి చికిత్స పొందుతున్నారని, విచారణ నివేదిక రాగానే బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని కళా వెంకట్రావు హెచ్చరించారు.

శ్రీకాకుళం రిమ్స్‌లో ఇంజెక్షన్ వికటించి మరణించిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ప్రభుత్వం పరిహారం ఇవ్వనుంది. మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. ఇంజెక్షన్ వికటించిన ఘటనపై దర్యాప్తుకు సీఎం ఆదేశించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సీఎం చెప్పారు.

# 9న సీతారాముల కళ్యాణం

విజయనగరం: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం శ్రీమద్రామయణప్రాంగణం శ్రీరామనారాయణంలో ఈ నెల 9వ తేదీ గురువారం ఉదయం సీతారాముల కళ్యాణం జరుగనుందని ఎన్ సి ఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు స్నపనము, అభిషేకం, 10 గంటలకు కళ్యాణం జరుగుతుందని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

# సీజనల్ వ్యాధులపై ప్రత్యేక బృందాలు

విజయనగరం: సీజనల్ వ్యాధుల నియంత్రణకై జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ, పంచాయితీరాజ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి సరఫర శాఖ, ఐ.సి.డి.ఎస్. శాఖాధికారులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల్ పేర్కొన్నారు. ప్రజా వినతుల స్వీకరణలో అధికారులతో మాట్లాడుతూ వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో 3 బృందాలు ఏర్పాటుచేశామని, ఆ బృందాలకు నిర్ధేశిత లక్ష్యాలు కూడా ఉన్నాయని వ్యాధుల నివారణకు ఆయా బృందాలు తక్షణచర్యలు గైకొనాలన్నారు. రోజూవారీ నివేదికలు కూడా జిల్లా కలెక్టర్‌కు పంపించాలని ఆదేశించారు.

# ఋణ మాఫీకి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం:జిల్లాలో ఋణ మాఫీకి అర్హులైన బకాయి రైతులకు పరిష్కారాలపై ఈ నె 9వ తేదీన విజయనగరం కలెక్టర్ కార్యాలయలోను, 10వ తేదీన పార్వతీపురంను ప్రత్యేక ప్రజా వినతులు స్వీకారం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ తెలిపారు. జిల్లాలోని మిగిలిన అర్హులైన రైతులు తమ దరఖాస్తులతో సహా ఆయా రోజుల్లో పాల్గొనాలని తెలిపారు. మిగిలిన అర్హులైన రైతులు తమదరఖాస్తులతో ఋణ మాఫీ పొందవచ్చని తెలిపారు.

# ఆ భూములను బదలాయించండి : కేటీఆర్

హైదరాబాద్: నగరంలో స్కైవేల నిర్మాణం కోసం రక్షణ శాఖకు చెందిన భూములను వీలైనంత త్వరగా బదలాయించాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ మరోమారు కోరారు. బెంగళూరులో మౌలిక సదుపాయాల కల్పన కోసం 210 ఎకరాల రక్షణ శాఖ భూములను బదలాయించిన అంశాన్ని ట్విట్టర్‌లో ప్రస్తావించిన ఆయన... హైదరాబాద్‌లో స్కైవేల నిర్మాణం కోసం రక్షణ శాఖ భూములు కోరుతున్న అంశాన్ని గుర్తుచేశారు.

# సాధికారిక సర్వేలో పేర్లు నమోదు తప్పని సరి!

విజయనగరం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలు ప్రజాసాదికారిక సర్వేలో నమోదు చేయాలని అది తప్పదని కటెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్ అన్నారు. సంక్షేమ పథకం పొందాలన్నా లబ్దిదారు ప్రభుత్వం నిర్వహించిన ప్రజా సాధికార సర్వేనందు విధిగా నమోదు కాబడివుడాలని తెలిపారు. జిల్లాలో 12000 మంది జనాభా సర్వేనందు నోదుకాలేదని గుర్తించామన్నారు. ఇప్పటివరకు సర్వేలో నమోదు కానివారు ఈ నెల 7వ తేదీ నుండి 14వ తేదీ వరకు ఆయా మండలాల్లోని తహసిల్దారు కార్లాయం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యలయం పనివేళల్లో నమోదు చేసుకోవాలని లేనిపక్షంలో ప్రభుత్వ అందించే సంక్షేమ పథకాలకుఅరుహలుకారని ఆయన స్పష్టచేశారు.

# ప్రజాక్షేత్రంలో సి.ఎం. మూల్యం చెల్లించాల్సిందే ! ఎమ్మెల్సీ కోలగట్ల

విజయనగరం: ప్రజలను నయవంచన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాక్షేత్రంలో మూల్యం చెల్లించుకునే సమయంలో ఆసన్నమైందని ఈ తరుణంలో ఆర్యవైశ్యులంతా ఏకమై వైయస్సాకాంగ్రెస్ పార్టీని గెలిపించలని శాసనమండలి సభ్యులు ఉత్తరాంధ్ర పార్టీ కన్వీనర్ కోలగట్ల వీరబధ్రస్వామి పిలుపునిచ్చారు. సోమవారం రాజమండ్రిలో ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్ళిన కోలగట్లకు అక్కడి ఆర్యవైసయ సంఘం పార్టీ కార్యకతలతో ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని వర్గాల ప్రజలు వైయస్సార్ విజయానికి ఎదురుచూస్తున్నారని, ప్రజలకు ఇచ్చిన హామిలను నెరవేర్నఇ ప్రభ/త్వాన్ని గద్దెదింపాలని అన్నారు. జగన్ పాలనలోకి వస్తే వైశ్యకార్పరేషన్ ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి పార్టీ సమన్వయకర్త శివరామ సుబ్రహ్మణ్యం, కో-ఆపరేటీవ్ అధ్యక్షులు సీతారాం, వైఎంబిఏఅధ్యక్షులు పుపర్తి వెంకటేష్, శివరామ్ కళ్యాణ్ ల్యాబ్ ఎం.డి. సత్యవరపు గోకుల మురళీ, తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్సీలో వినతులు వెల్లువ..

విజయనగరం: జిల్లా పాలనాధికారుల వ్యక్తిగత శ్రద్ధ వల్ల జిల్లా అధికారులు వినతులపై ఎటువంటి కొర్రిలు వేయకుండా సానుకూల పరిష్కారానికి శ్రద్ధచూపడంతో వినతుల పరిష్కారం వేగవంతమైందని యంత్రాంగం తెలుపుతున్నాది. సోమవారం జరిగిన ప్రజావినతుల వేదికలో ఫించన్ల మంజూరుకు, గృహనిర్మానాల రుణాలకు, దరఖాస్తులు వచ్చాయి. ముఖ్యంగా డెంకాడ గ్రామ ప్రజలు తమ గ్రామంలో 100 మంది డెంట్యూతో కలిగిన రక్తహీనతతో బాధపడుతున్నారని వారిని ఆదుకోవాలని గ్రాస్థులు విన్నవించారు. ఎసీంసలేబర్ కాంట్రాక్ట్ సొసైటీ జాగారాం కాంట్రాక్టుర్ల రిజిస్ట్రేషన్ గడువు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమలో జిల్లా కలెక్టర్ ఎం.హరిజవహర్‌లాల్, సహాయ కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, సహాయ జాయింట్ కటెక్టర్ జె.సీతారామారావుతో సహా డిఆర్ఓ వెంకటరావు, మున్సిపల్ కమిషనర్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికే

# ప్రజా సంకల్పయాత్ర

విశాఖ యాత్రకు భారీ స్వాగతం పలకాలి - రాబోయేది రాజన్న రాజ్యమే

జగన్ సంకల్ప యాత్రలో పాల్గొన్న వైకాపా రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, ఉత్తర సమన్వయకర్త కెకె రాజు





విశాఖపట్నం : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్రలో భాగంగా ప్రత్తిపాడు నియోజక వర్గంలో సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సనపల చంద్రమౌళి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్ర ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నారని, రాష్ట్రంలో అధికార పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైనే వైకాపా పోరాటాలు చేస్తుందని అన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో ప్రజా సంకల్ప యాత్ర చివరి దశకు చేరుకుందని మరో కొద్ది రోజుల్లో విశాఖపట్నం జిల్లాలో ప్రారంభమౌతుందని, ఈ యాత్రలో ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొని జగన్మోహన్ రెడ్డికి స్వాగతం పలకాలని చంద్రమౌళి పిలుపునిచ్చారు.

**జగనన్న తో విశాఖ ఉత్తర నియోజకవర్గ నేతలుపాదయాత్ర**

అధినేత జగన్మోహన్ చేస్తున్న ప్రజా సంకల్ప యాత్రకు సంగిభావంగా తూర్పు గోదావరి జిల్లాలో పత్తిపాడు లో ఆయనతో పాటు విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, వార్డు అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్స్, ఇతర నాయ కులు కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఈ రోజు పాదయాత్ర పత్తిపాడు నియోజకవర్గ లో పాదయాత్ర చేశామని, త్వరలో విశాఖ జిల్లాలో జరగనున్న పాదయాత్ర గురించి చర్చించి విజవంతం చేస్తామని జగన్మోహన్ రెడ్డి తెలియజేసామన్నారు.

# శ్రీ శారదాపీఠం ప్రాంగణంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృతాభిషేకం



విశాఖపట్నం: షణ్మత స్థాపన ఆచార్య జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారు ఋషికేశ్‌లో నిర్వహిస్తున్న చాతుర్మాసదీక్షలో భాగంగా శ్రీ శారదాపీఠం శాఖా భవనంలో సోమవారం అడైకృత్తిక పర్వదినం సందర్భంగా శ్రీ దండాయుధ పాణికి (శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి) నమక, చమక, మన్యుసూక్తం, పురుష సూక్తం, వేద మంత్రోచ్చారణ ల నడుమ విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అనుగ్రహభాషణం చేస్తూ జాతకరీత్యా సంక్రమించే దోషాలు, కుజస్థంభన, కాలసర్పదోషాలు వంటివి తొలగుతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో శ్రీ శారదాపీఠం ఉత్తరపీఠాధిపతి బాలస్వామి మరియు వేద విద్యార్థులు పాల్గొన్నారు.

స్వామి దివ్య ఆశీస్సులతో విశాఖ శ్రీ శారదాపీఠం ప్రాంగణంలో గల వల్లీ దేవసేన సహిత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృతాభిషేకం ఘనంగా జరిగింది. ముందుగా పీఠ ప్రాంగణంలో గల శ్రీ దక్షిణామూర్తి దేవాలయంనుండి హరోం హర అను నినాదంతో భక్తులు భక్తిపారవశ్యముతో పాలకావడి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సాయంత్రం శ్రీ వల్లీ దేవసేన సహిత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కల్యాణోత్సవం కనులవిందుగా పండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# ఎపిఎమ్‌బిసి కార్పోరేషన్ చైర్మన్‌కు ఎమ్మెల్సీ మూర్తి సన్మానం



విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ ఆత్యంత వెనకబడిన తరగతుల సంక్షేమ అభివృద్ధి సంస్థ (ఎపిఎమ్ బిసి) కార్పోరేషన్ నూతన చైర్మన్‌గా నియమితులైన కాకి గోవిందరెడ్డిని పార్లమెంట్ మజీ సభ్యుడు, రాష్ట్ర శాసన మండలి సభ్యుడు డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తి సోమవారం సన్మానించారు. వెనకబడిన తరగతుల అభివృద్ధికి ప్రభుత్వం అమల చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకువెళ్ళి ఎక్కువ మంది లబ్ధి పొందేలా చూడాలన్న ఆకాంక్షను డాక్టర్ మూర్తి ఈ సందర్భంగా వ్యక్తం చేశారు.

సీఎం కేసీఆర్‌కు

## సోదరీ వియోగం

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సోదరి లీలమ్మ కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె సోమవారం ఉదయం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. కేసీఆర్ ఢిల్లీ పర్యట నను అర్థాంతరంగా ముగించారు.


LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans Mortgage Loans Home Loans Personal Loans and Pvt. Loans... Etc.,
94902 33750


# 9న రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ ఎన్నిక

ఎన్డీయే తరపున జేడీయూ ఎంపీ హరివాన్స్ బరిలో ఎంపీ వందన చవాన్

చైర్మన్ వెంకయ్యనాయుడు



దిల్లీ: రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ బరిలో ఎన్డీయే అభ్యర్థిగా జేడీయూ ఎంపీ హరివాన్ష్ పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. గురువారం రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ ఎన్నికలు జరగనున్నట్లు ఛైర్మన్ వెంకయ్యనాయుడు సోమవారం సభా ముఖంగా వెల్లడించారు.

ఆగస్టు 8 మధ్యాహ్నం లోపు నామినేషన్లు దాఖలు చేయాలని ఆయన తెలిపారు.

కాంగ్రెస్ ఎంపీ పీజే కురియన్ ఈ ఏడాది జూన్‌లో పదవీ విరమణ చేశారు. దీంతో అప్పటి నుంచి ఆ స్థానం ఖాళీగానే ఉంది. కేరళ నుంచి కాంగ్రెస్ తరపున ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు.

అనంతరం యూపీఏ హయాంలో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఎన్డీయే తరపున హరివాన్ష్ పోటీపడుతుండగా.. యూపీఏ తరపున ఎన్సీపీ ఎంపీ వందన చవాన్ బరిలో ఉన్నారు.

రాజ్యసభలో భాజపా అతిపెద్ద పార్టీగా ఉన్నప్పటికీ.. పూర్తి స్థాయిలో మాత్రం మెజారిటీ లేదు. ఎన్డీయేకు మద్దతు ఇస్తున్న కొన్ని పార్టీలు ఉపసంహరించుకోవడంతో ఆ పార్టీకి మెజారిటీ సన్నగిల్లుతోంది. ఈ ఎన్నికల్లో బీజేడీ, తెరాస, అన్నాడీఎంకే, ఎన్డీయే మిత్రపక్షమైన శివసేన కీలక పాత్ర పోషించనున్నాయి.







**జనసేనలోకి**

## మాజీ మంత్రి ముత్తా గోపాలకృష్ణ

హైదరాబాద్: మాజీ మంత్రి, తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు చెందిన పారిశ్రామికవేత్త ముత్తా గోపాలకృష్ణ జనసేన పార్టీలో చేరనున్నారు. హైదరాబాద్ లోని జనసేన పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో ప్రత్యేకంగా భేటీ అయిన గోపాలకృష్ణ... పవన్ కోరిక మేరకు త్వరలోనే జనసేనలో చేరేందుకు అంగీకరించారు. జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీలో ముత్తాకు ప్రత్యేక స్థానం కల్పించనున్నట్లు పవన్ తెలిపారు. మరోవైపు ఈ నెల 14న జనసేన పార్టీ ఎన్నికల ముందస్తు ప్రణాళికను విడుదల చేసేందుకు సన్నద్ధమవుతోంది. విద్యావ్యవస్థపై పార్టీ పాలసీ కమిటీ రూపొందించిన ముసాయిదాపై సుదీర్ఘంగా చర్చించిన రాజకీయ వ్యవహారాల కమిటీ... ఫిన్లాండ్ తరహాలో విద్యావిధానాలను ఆంధ్రప్రదేశ్‌లో దశలవారీగా అమలు చేసే తీరుపై అధ్యయనం చేస్తున్నారు.

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలకు జనసేన సంస్థాగత నిర్మాణ కమిటీలను ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి, అమరావతి ప్రాంతాలకు ప్రాంతీయ సమన్వయకర్తలను నియమించారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com